# రుద్రనేత్రం

చీకటి పడింది.

అడవిలో కొండల మధ్యన చిన్న రైలు స్టేషను.

రెండు రోజులనించి కుంభవృష్టిగా ఎడతెరిపి లేకుండా కురిసిన వాన వెలిసినా, ఆకాశం ఇంకా మబ్బు మబ్బుగానే ఉంది. తేమగాలులు వీస్తున్నాయ్. చెమ్మగాలితో మరింత చిక్కబడిన కార్తీక మాసపు చలి వొణికించేస్తోంది.

ప్లాట్‌ఫారం నిర్మానుష్యంగా ఉంది.

చంద్రుని వెన్నెల మబ్బుల చాటునుంచి అప్పుడప్పుడూ నీరసంగా పొడగట్టి చీకటిలో పొగలా విస్తరించుకున్న మంచులో జీర్ణించుకుపోతోంది. ప్లాట్‌ఫారం చివరన చింతచెట్టు కింద రాక్షసి బొగ్గుతోనూ, పాత స్లీపర్ చెక్కలతోనూ సెగమంట వేసుకుని రైల్వే కూలీలు చలికాగుతున్నారు.

స్టేషను మాస్టరు గదిలోనుంచి ఫోను ఎడతెరిపి లేకుండా మోగుతోంది. నైటు డ్యూటీలో ఉన్న చిన్న మేష్టరు మళయాళీ యాసతో ''హళో....'' మని వాటిని రిసీవ్ చేసుకుంటున్నాడు.

యార్డులో రైలింజను ఒగరుస్తూ షంటింగ్ చేస్తోంది. పాయింట్స్‌మన్ చేతి దీపం ఊపుతూ రంగులు మారుస్తూ, సిగ్నల్స్ ఇస్తున్నాడు. వేగన్ల కుదుపులాట, కప్లింగ్‌ల శబ్దాలు, పాయింట్స్ మారుస్తున్నప్పుడు ''గ్లిక్! గ్లిక్!'' మనే శబ్దాలు చలికాచుకుంటున్న కూలీలకి సుస్పష్టంగా వినబడు తున్నాయి.

దూరంగా చీకట్లో సిగ్నల్ దీపాలు మెరుస్తున్నాయి.

''ఇప్పుడే ట్రాలీ ఏసుకుని తిరిగొచ్చాం. లైనుగట్టు ప్రక్క నీరు బాగా జమాయించి పోయుంది. కొండల్లో బాగా వర్షం కొట్టినట్టుంది. తూములు, కానాలు తెగనిండిపోయి పారుతున్నాయి. లైను మాత్రం ఎక్కడా దెబ్బతినలేదు. అక్కడక్కడ మెట్లంగి రాయి జారిపోయిన చోట గేంగోళ్ళు పేకింగ్ చేసేశారు. రోజల్లా ట్రాలీ తోసి తోసి రెక్కలు లాగేస్తున్నాయ్.'' అంటూ చింతచెట్టు కింద మంట కాచుకుంటున్న ట్రాలీమన్ రంగడు మిగతా కూలీలకి చెప్తున్నాడు.

''హళో''....'' చిన్న మేష్టరు గొంతు........ బ్లాక్ ఇన్‌స్ట్రుమెంటు కడకడలు.

''ఈ కేరళ చిన్న మేష్టరొకడూ! అబ్బా...... గొంతుకలో గులకరాళ్ళెట్టుకున్నట్టు ఒకటేగోల'' అంటూ సింహాచలం చిరాగ్గా దుప్పటిని మరింత దగ్గరిగా కప్పుకుంటూ ప్రక్కనున్న కర్రచెక్కని కాలుతున్న బొగ్గుల మీదికి విసిరి అలా కూర్చొనే ఎడమకాలితో తంతూ ఎగదోసి మంటని రాజే శాడు. కాలుతున్న రాక్షసి బొగ్గుల్లోనించి చిమ్మిన నల్లని పొగ, మీదికి లేస్తూ పల్చబడి తెల్లబడుతూ మంచుతెరలా కప్పేస్తోంది..... తారు వాసన...... ముక్కులు మండుతున్నాయి. దగ్గుకుంటూ, పొగలో మండుతున్న కళ్ళకి చేతులు అడ్డం పెట్టుకుంటూ, చతికిలబడిన వాళ్ళు సర్దుకుంటూ దూరంగా జరిగి కూర్చుంటున్నారు.

''పిచ్చినా కొడకా! తడిసిపోయిన చెక్కేస్తావా'' అంటూ ముక్కు చీదుకుంటూ కర్రచెక్కని

బొగ్గుల్లో నుంచి బైటికి లాగి దానితోనే బొగ్గుల్ని ఎగదోశాడు రంగడు. రివ్వున చలిగాలి వీచింది. నిప్పులు కణకణమని రాజుకుంటున్నాయి. కాలుతున్న రాక్షసి బొగ్గు సందుల్లోనించి పొగలు, నీలి మంటలు చిమ్ముతున్నాయి. చిట్లుతున్న కర్రచెక్కల్లోనించి ఉవ్వెత్తుగా లేస్తున్న నిప్పురవ్వలు చీకట్లో చింతచెట్టు కొమ్మల్లోకి మిణుగురుల్లా ముసురుకుంటున్నాయి.

మంచుకురుస్తున్న చీకటిలో సెగమంట వెలుగునీడలు. రాక్షసి బొగ్గువేడి- హాయిగా ఉంది. కబుర్లాడుకుంటున్నారు.

సిగ్నల్ రెక్కవాలిన చప్పుడు – చీకట్లో పచ్చదీపం.

''మెయిన్ లైన్‌లో బండొస్తున్నట్టుంది''. అనుకుంటూ గేంగ్‌మెన్ క్వార్టర్సులో నుంచి చీకట్లో లైన్లు దాటుకుంటూ ప్లాట్‌ఫారం గట్టు ఎక్కాడు పెట్రోల్ మేన్ పైడయ్య, ఆరిపోయిన చుట్టతో. చేతి దీపం ఎత్తిపట్టి, చుట్టని దాంట్లో వెలిగించి, పెదాలతోనే పట్టితిప్పుతూ గుప్పుగుప్పున పొగని నోట్లోంచీ, ముక్కుల్లోంచీ వదిలాడు. బాగా అంటుకున్నాక చుట్టని అలానే పంటితో నొక్కిపట్టి పొగకి కళ్ళు మూసుకుంటూ హేండ్‌లాంప్ అద్దంవేసి క్రిందికి దించాడు. చుట్టని ఎడమ చేతిలోకి తీసుకుని మరిరెండు దమ్ములు గట్టిగా లాగి తుపుక్కున ఉమ్మి మోచేత్తో మూతి తుడుచుకుంటూ ప్లాట్‌ఫారం అంతా కలయ చూశాడు. మసిబారిన ప్లాట్‌ఫారం లాంతరుచిమ్నీ లోంచి గుడ్డి వెలుగు పడుతోంది. చిమ్నీ మీద చెరిగిపోయిన స్టేషను పేరు అస్పష్టంగా ఎర్రక్షరాలతో కనిపిస్తోంది. స్టేషను మాస్టరు గదిలోంచి దీపం కాంతి ప్లాట్‌ఫారం మీద పడుతోంది. దూరంగా సిగ్నల్ దీపాలు..... ఎరుపు....... ఆకుపచ్చ....... వెనకాల విస్తరించుకొనున్న చీకట్లు .

'' ఏట్రా పైడయ్యా. పెట్రోలు డ్యూటీ తగిలిందేటి'' అన్నాడు రంగడు సెగమంట దగ్గరనుంచి.

''అవునొశే!'' అంటూ చేతిలో దీపంతో నడుచుకుంటూ మంటదగ్గరికి వెళ్ళాడు పైడయ్య. నల్లని ఊలు బనీను తొడుక్కున్నాడు. మోకాళ్ళవరకూ కచ్చగట్టిన పంచె మాసిపోయుంది. మెళ్ళో మప్లరూ, చంకలో చిన్న సంచీ వేలాడుతున్నాయి. పైడయ్య నడుస్తున్నప్పుడు ఊగుతున్న ఆ సంచీలో పటాకీలు (ఫాగ్ సిగ్నల్స్) అప్పుడప్పుడూ టకటకలాడుతున్నాయి.

పైడయ్య సెగ మంటదగ్గర కూర్చున్నాడు. మంట వెలుగు పైడయ్య ముఖంమీద పడుతున్నప్పుడు కణతలమీద ఉబ్బిన నరాలు, మెడక్రింద ముడతలు దేరిన చర్మం, మీసాలమీద పొడుచు కొస్తూ జవజవలాడుతున్న చెక్కిళ్ళు జిడ్డుజిడ్డుగా నిగనిగలాడుతున్నాయి. పైడయ్య మరో రెండు సంవత్సరాల్లో రిటైరై పోతున్నాడు. నెరిసిపోయి పీచుదేరిన జుట్టుతోనూ, అలసిపోయి జీరలుతేరిన కళ్ళతోనూ వయస్సు సుస్పష్టంగా కనిపిస్తున్నా, వెడల్పాటి భుజాలు, దృఢమైన కాలి పిక్కలూ కాయకష్టంతో చేవదేరి దిట్టంగానే ఉన్నాయి!

''నువ్వొక్కడివే బయలుదేరావేటీ! ఇంకొకడేడీ?''

''నాకూ, రాములుగాడికీ డ్యూటీ ఏసేడు ఇనస్పెట్టరు. ఆ రాములుగాడు ఫుల్‌గా తాగేసి తొంగు న్నాడు. ఏట్రా ఇది అంటే '' ఈ తూరికి నువ్వు నప్పించెయి మావా'' అని కాళ్ళూ చేతులు అట్టుకుంటు న్నాడు ..... దాంట్లో కుర్రలంజికొడుక్కి కొత్త పెళ్లాం..... పోనీ ఇనస్పెట్టరు దగ్గరకెళ్ళి మరొకడిని ఎయ్యించుకుందామంటే, అసలే రాములంటే గిట్టదు కదా ! ఆడిమీద మీదికి

రాసి ఉద్యోగానికి బొక్కెట్టేస్తాడు - సరే అని నానొక్కడినే బయల్దేరిపోనాను'' అన్నాడు పైడయ్య, రాక్షసిబొగ్గు మంటకి చుర్రుమంటున్న కాలిముణుకుల్ని చేత్తో రాసుకుంటూ.

''సింహాచళం..... ఒరేయ్ సింహాచళం ఎక్కడ్రా?'' అని చిన్న మేష్టరు తన గదిలోంచి అరుస్తూ కేకలేస్తున్నాడు.

'' ఉండహే! ఈడొకడు'' అని మెల్లగా గొణుక్కుంటూ '' ఆ......... ఆ...... వొస్తున్నా బాబూ'' అని బిగ్గరగా అక్కణ్ణించి లేవకుండానే చిన్న మేష్టరుకు వినిపించేటట్లు అరిచాడు.

'' ఎళ్ళురా! లైన్‌క్లియర్ అయిందికదా సిగ్నల్ ఇచ్చేశారు! '' అన్నాడు పైడయ్య. '' ఆడు అలాగే అరుస్తాడులెద్దూ! నోట్లో గచ్చకాయ ఎట్టుకున్నట్లు ఒకటే గోల. తెల్లవార్లూ అలానే అరుస్తుంటాడు. ఆడు తొంగోడు, నాకు తొంగోనియ్యడు. కేరళావోడు. మనిషిమాత్రం చాలా మంచోడు సుమా! అరుస్తాడేగాని, నాను డ్యూటీ ఎగ్గొట్టేసినా, పనిలో తొంగుండిపోయినా అలా అరుస్తూ తిట్టుకుంటూ ఆడి పనీ, నా పనీ అన్నీ ఆడే చేసేసుకుంటాడు. గొప్ప చురుకైనోడు'' అన్నాడు పోర్టరు సింహాచలం కుట్టిని తెగమెచ్చేసుకుంటూ.

ఇంతలో కుక్క ఒకటి స్టేషను వెనకాలనుంచి ఫెన్సింగులోనుంచి దూరి ప్లాట్‌ఫారం మీద కుంటుకుంటూ పరుగెత్తుతూ మంట దగ్గరికి వస్తోంది. మంట వెలుగులో దానికళ్ళు చరాలున మెరిశాయి. ఎడంకాలు రైలుక్రిందపడి చిన్నప్పుడే తెగిపోవటంవల్ల సరిగా మోపలేకపోతోంది. మూడుకాళ్ళమీదే కుంటుకుంటూ పరుగెత్తుతోంది.

''నా మాట ఇంది. పారొస్తోంది......... దాదా'' అంటూ లొట్టలుకొట్టి పిలిచాడు కుక్కని పైడయ్య. ఆ గొంతు వినగానే ఒక్క ఊపున మనుషుల్ని తోసుకుంటూ ఒళ్ళంతా ఊపుకుంటూ, ముద్దుగా మొరుగు కుంటూ అమాంతంగా పైడయ్యమీదపడి మారాం చేస్తూ నాకేస్తోంది. '' ఉండహే! ఉండహే'' అని దాన్ని సముదాయిస్తున్నాడు పైడయ్య. కుంటికుక్క పొగపట్టిన తెల్లకాగితం రంగులో ఉంది. కుడికంటిమీద నల్లటి మచ్చ. అది ఆకలితో చిక్కిపోవడంకంటె బెంగ తోనూ, బాధలతోనూ కృశించిపోయినట్లుగా ఉంది. పొదుగులు ఎండిపోయి వేలాడుతున్నాయి.

పైడయ్య దాన్ని సముదాయిస్తూ దగ్గర పడుకోబెట్టుకున్నాడు. అది వెల్లకిలా పడుకుని కాళ్ళతో గీకుతూ పైడయ్యతో ఆడుతోంది. పైడయ్య దాని మెడ మీద, చెవుల్లోనూ గోకుతూ బుజ్జగిస్తున్నాడు. అది పైడయ్యకి మరింత దగ్గర దగ్గరగా జరుగుతూ ఒంటిని అంటిపెట్టుకుని మరీ పడుకుంటోంది. ఒకవైపు సెగవేడి, మరోవైపు పైడయ్య శరీరపు వెచ్చదనం మధ్య ఒదిగిపోయిన కుక్క పైడయ్య నిమురుతున్న స్పర్శసుఖంతో మగతగా కళ్లు మూసుకుంటోంది.

'' రెండు రోజుల్నించీ సరిగ్గా తిండి కూడా తినటంలేదు. పిల్లలమీద బెంగెట్టేసుకుంది'' అన్నాడు పైడయ్య దాని లోతుకు పోయిన డొక్కల్ని చూస్తూ.

'' పిల్లలు సచ్చిపోయినాయేటి?''

''లేదురా. మళ్ళీ ఈ యీతపిల్లల్ని కూడా దుమ్మలగొండు ఎత్తుకుపోయింది. ఇది మూడో ఈత. ప్రతీసుట్టూ మూడు పిల్లల్నే ఎడతాది. ఇది కనడం, రోజులు తిరక్కుండానే దుమ్మల గుండ్లో, పెద్ద నక్కలో ఎత్తుకుపోవడం - ఒక్కటి కూడా మిగల్లేదు, అదేటో దాని కర్మ - నాలాగే పిల్లలు దక్కకుండా పోతున్నాయి. చివరిమాట అనేసరికి పైడయ్య గొంతులో తడి ఆరినట్టయింది.

పైడయ్య కి నా అన్నవాళ్ళు ఎవరూ లేరు. అయిదేళ్ళ క్రితమే పెళ్లాం పోయింది. అది పోయి రెండు సంవత్సరాలు తిరక్కుండానే ఇద్దరు పిల్లలూ పోయారు. తను ఏకాకిగా మిగిలి పోయేడు. ఆఖరివాడు ప్లాట్‌ఫారం మీద ఆడుకుంటూ రైలుకిందపడి కాలు తెగిపోయిన కుక్కపిల్ల కనిపిస్తే నెత్తురు కారుతున్న దాన్ని ఆప్యాయంగా ఎత్తుకుని ఇంటికి తీసుకొచ్చి పెంచుకుందామని తండ్రితో మారాం చేశాడు. మిగిలిన ఒక్క పిల్లడి ముచ్చట తీరుద్దామని దానికి కట్టుకట్టి పిల్లడితో సహా దాన్ని, ఆప్యాయంగా పెంచాడు. దాని కాలు కొండిది కాబట్టి పైడయ్య కొడుకే దానికి ''కొండి'' అని పేరు పెట్టాడు.

కొండి పెరిగి పెద్దదవుతూ పిల్లల్ని కూడా కంటోంది. దాన్ని తెచ్చిన పిల్లాడు మాత్రం మరి లేడు. తండ్రిని ఏకాకిని చేసేసి 'కొండి'ని విడిచిపెట్టి సుదూరలోకానికి వెళ్ళిపోయాడు. అది తలుచు కుంటున్న పైడయ్యకి కళ్ళు చెమ్మగిల్లేయి. పరధ్యానంగా దూరాన చీకట్లోకి చూస్తూ 'కొండి'ని మరింత ఆప్యాయంగా తనివిదీరా నిమురుతున్నాడు.

''బోఁయ్'' మని రైలింజను ఓండ్ర పెట్టినట్లు అరుచుకుంటూ వచ్చేస్తోంది. ఆ అరుపుకి సింహాచలం మనలో పడ్డాడు.

''గూడ్సుబండి – స్టార్టర్ ఇచ్చేశాడు. ఆగదు'' అన్నాడు పోర్టరు సింహాచలం చతికిల బడిన వాడల్లా లేచికూర్చుంటూ.

చీకట్లో నుంచి రైలు వస్తోంది. హెడ్ లైటు కాంతిలో రైలుపట్టాలు నున్నగా మెరుస్తున్నాయి. ప్లాట్ ఫారం మీదికి బండి వచ్చేసింది. రైలు కమ్ములు ఎగిరిపడుతున్నాయి. ఘీంకరించుకుంటూ శరవేగంతో మెరుపులా దాటిపోయింది. ఆ ఊపుకి ప్లాట్‌ఫారంమీద చెత్త, ఆకులూ గాలిలో లేచి సుడులు తిరుగుతూ చీకట్లో ఎగురుతున్నాయ్. కొండి అదిరిపడి లేచి ఒళ్ళంతా విదిలించుకుంటూ, చెవులు టపటపమని కొట్టుకుంటూ తిరిగి పడుకుంటోంది.

చింతచెట్టుమీద కాకులు అరుస్తూ లేచాయి.

రైలు శబ్దం రానురాను దూరమౌతోంది. గార్డు పెట్టె వెనకాల ఎర్రదీపం మలుపులో చీకట్లో కనుమరుగయింది.

ప్లాట్‌ఫారం మీద అంతవరకూ ఆకుపచ్చదీపం ఊపుతున్న చిన్న మేష్టరు కుట్టి దీపం రంగు మారుస్తూ పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ '' ఒరేయ్ సింహాచళం... బ్లడీఫూల్.... బద్మాష్'' అని హిందీ లోనూ, ఇంగ్లీషులోనూ మలయాళీయాసతో తిట్టుకుంటూ మంటదగ్గరకు వచ్చాడు.

సింహాచలం లేచి నిలుచున్నాడు.

'' ఒరేయ్! పోర్టరువి నువ్వా, నేన్రా? సువర్'' అని హేండ్ లాంప్ ఎత్తి చూపుతూ అడిగేడు.

''ఇశ్శీ! పోన్లెబాబూ. ఏం కొంపమునిగిపోయింది, వయస్సులో ఉన్న కుర్రోడివి టోకెనందు కుంటే చెయ్యి పీకెట్టేస్తాదేంటి!

''ఈ రోజు టోకెన్ అందుకున్నా. రేపు ప్లాట్‌ఫారం కూడా నన్నే క్లీన్ చెయ్యి మంటావ్. చల్, ఉల్, పదరా. రేపు నీ మీద కంప్లయింట్ ఇచ్చేస్తాను'' అని గట్టిగా కోపంగా అందామనుకుని ప్రారంభించి మధ్యలో నవ్వేశాడు. అందరూ నవ్వుకుంటున్నారు. ఇంతలో కుట్టి దృష్టి పైడయ్యమీద పడింది.

''నువ్విక్కడేంచేస్తున్నావ్? ఈళ్ళకి బూతు స్టోరీస్ చెబుతున్నావా ఒల్డ్ బగ్గర్!'' పైడయ్య ముసిముసి నవ్వులు నవ్వుతూ మగతనిద్రలో ఉన్న కుక్క చెవులు గోకుతున్నాడు. చెవి సందులో కందిగింజలాంటి కొఱుసు చేతికి తగిలింది. చటుక్కున పీకాడు. కొండి ''కంయ్'' మని అరిచింది.

''ఫక్ ది హెల్, ఎంత కొఱుసురా బాబూ, అసలే బక్కచిక్కుంది. ఈ కొఱుసులు మిగిలిన దాని నెత్తుర్ని పీల్చేస్తున్నాయ్'' అని కుక్క బొచ్చులో అంటుకున్న కొఱుసుని మంటవెలుగులో క్షణం సేపు పరీక్షగా చూసి '' దీని అమ్మ'' అని తిట్టుకుంటూ మంటల్లో పడేశాడు.

'' నోరు విప్పితే బాడ్ వర్డ్స్, బ్లడీ ఓల్డ్ ఫెలో, ఫక్, ఫక్, ఒరేయ్ ఎవడో నిన్ను మర్డర్ చేసేస్తాడు. ''మన'' పెళ్ళం దగ్గర కూడా ''ఫక్ ది హెల్'' అని శ్లాంగ్ యూజ్ చేసేవాడు . '' మన'' వైఫ్ చాలా షేమ్ ఫీలయిపోయేది. ఆ వర్డుకి మీనింగు కూడా ఈడికి చెప్పాను . వినడే! ఆడికది హేబిట్ అయి పోయింది. ఓల్డు ఫెలో అయిపోయినా బూతులు!'' అన్నాడు కుట్టి.

పైడయ్య ఆ మాటలు వింటూనే సింహాచలాన్ని ఉద్దేశించి '' ఒరే సింహాచలం ! ఈ మేష్టరు ఈ స్టేషనుకి కొత్తగా వచ్చాడ్రా! పాపం నెలరోజులయిందో లేదో మశూచికం పడిపోయేడు. అమ్మ తల్లి ఒంటినిండా కుండ లే సేసింది. తోడు ఎవరూ లేరు. గదిలో నేనే కనిపెట్టుకుని గుగ్గిలం ధూపం అవీ ఏసేవోణ్ణి. కసింత కనుమరుగైతేసాలు జజ్జరిల్లిపోతూ మంచం మీద ఎగిరి పడుతుండే వోడు. ఆడదానిలాగ ఒకటే ఏడుపు అనుకో, కరిత్తమ్మా! కరిత్తమ్మా! అని ఒకటే గోలపెడుతూ పాట పాడినట్టు రాగాలు తీస్తూ అదే ఏడుపు. అమ్మ అమ్మ అంటున్నాడు కదా తల్లిమీద బెంగెట్టేసు కుని బెంబేలెత్తిపోతున్నాడేమో అనుకున్నాను. తరువాత తెలిసిందికదా, అది పెళ్లాం పేరని. కష్టాల్లో తల్లిని తలుచుకుని ఏడ్చేవోళ్ళని చూశానుగాని పెళ్ళాన్ని తలుచుకుని ఏడవటం నాకు ఎరికనేదు. ఆ అమ్మశలవులకివస్తే చూడూ! ఈ బాబు ఎక్కడైనా కనిపిస్తాడేమో! దొంగ 'సిక్' కొట్టేసి సెలవు పెట్టేసి తలుపు బిడాయించుకుని జెర్రిగొడ్డు నాగుపాముని చుట్టేసినట్టు పెళ్ళాన్ని చుట్టేసుకుని మరి పగలూ లేదు రాత్రీ లేదు. లఫండిక్స్‌లో పడిపోతాడు!'' చివరి పదాన్ని అర్థంచేసుకుని ఆ జోక్‌కి కుట్టితోపాటు అందరూ వికావికలై నవ్వుతున్నారు.

'' ఏటిబాబూ, మళ్లీ అమ్మ ఎప్పుడొస్తాది?'' అడిగాడు పైడయ్య.

'' మళ్ళీ నెక్స్ట్ ఇయర్ హాలిడేస్‌కే. ఇప్పట్లోరాదు''.

'' ఏటిబాబూ లోడ్ చేశావేంటి?'' అన్నాడు పైడయ్య. మళ్ళీ నవ్వులు. కుట్టి చిరుకోపంతో సిగ్గుపడుతూ హేండ్ లేంప్‌తో కొట్టబోతున్నట్లు ముందుకు వచ్చాడు.

'కంయ్' మంది కుక్క – మరో కొఱుసుని పీకి మంటల్లో విసిరాడు పైడయ్య.

'' నేను స్మాల్‌పాక్స్‌తో సఫరవుతూంటే నాకు ఈడు పచ్చి బూతు స్టోరీస్ చెబుతూ ఉండేవాడు. బట్టలు విప్పుకొని బాత్‌రూమ్‌లో నీళ్ళు పోసుకుంటున్న దొరసాన్ని ఎప్పుడైనా చూశావా? – అని అడిగాడు. దాని బేర్ బాడీని డిస్క్రయిబ్ చేసేవోడు. నేను పెయిన్‌తో చచ్చిపోతుంటే ఈడు పనిచేసిన డ్రైవర్ పీటర్సూ ఆడిపెళ్లాం లవ్ మేకింగ్ ఎలా చేసుకునేవారో చెప్తుండేవాడు . ఓల్డయిపోయినా సెక్సీఫెలో...''. ''మొదట్లో ఆ పీటర్స్ దగ్గర ఈడు ఇంజన్‌క్లీనర్‌గా పనిచేసేవాడట. ఆ దొర దగ్గరే బూతు తిట్లు నేర్చుకున్నాడు. కోపం వస్తే ఈణ్ణి ఆ దొర తెగ తన్నేవాడట.'' అన్నాడు సింహాచలం.

'' తన్నడమంటే ఇలాగలాగా? చేతికి ఏది దొరికితే దాంతో కొట్టేసేవోడు...... మనసా్స.... ఎన్న..... ఎన్న పూసనుకో, ఆ దొర చేతికి ఎముక లేదు. చేతికి ఎంత దొరికితే అంత జేబులో నుంచి తీసి ఇచ్చేసేవోడు. డబ్బంటే కేరేజాట్. ఆ బాబు ఎక్కడున్నాడో గాని సెయ్యెత్తి దండం పెట్టాలి..... ఉన్నాడో సచ్చిపోనాడో.. కోపమా ! ఉపద్రం! నోరిప్పితే 'ఫక్ ది హెల్' పెళ్లానికీ, నాకూ, ఇంజనుకీ, అగ్గికీ; ఒకటేమిటి- అన్నిటికీ ''ఫక్ ది హెల్!'' అని తిట్టేవాడు.'' అన్నాడు గతాన్ని నెమరు వేసుకుంటూ, మంటల మీద నుండి చీకట్లోకి శూన్యంగా చూస్తూ.... దూరంగా ఆకాశం మెరిసింది.

'' వర్షం రాదు కదా.... మెరుస్తోంది.'' అన్నాడు పైడయ్య

'' రాదులే . మేఘాలు తేలిపోతున్నాయి'' అన్నాడు రంగడు.

'' నో..నో... ట్వంటీఫోరవర్సు హెవీ రైన్స్ అని రాడార్ మెసేజ్ వచ్చింది. పైడయ్యా! లైను మీద పెట్రోలు డ్యూటీకి వెళ్తున్నావా? వెళ్ళు .... పధ్నాలుగో నంబరు కల్వర్టు దగ్గర ఎవర్తో ఆడది సూయిసయిడ్ చేసుకుంది.... ఘోస్ట్ అయి తిరుగుతుందట!''

''ఫక్ ది హెల్'' అన్నాడు పైడయ్య . మళ్ళీ అందరూ నవ్వులు.

''నన్ను జోక్ చెయ్యడం ఈడికి సరదా; బ్లడీ ఓల్డ్ బగ్గర్. అయితే ఈడు లేకపోయుంటే నేను స్మాల్‌పాక్స్‌తో ఆనాడే డైడయిపోయుందును. నేను కరాబు చేసేసిన బట్టలు, దుప్పట్లు ఆడే ఉతికేవాడు. రియల్లీ ఎ గాడ్. నన్ను జస్ట్ లైక్ మై ఫాదర్ లా సర్వ్ చేసేడు.'' అన్నాడు కుట్టి చెమరుస్తున్న కళ్ళని కాస్సేపు మూసుకుంటూ.

స్టేషన్ రూంలో ఫోన్ రింగవుతోంది.

'' ఫోను! పద, పద'' అంటూ కుట్టి సింహాచలాన్ని వెంటబెట్టుకొని గబగబ బయలు దేరాడు.

''చినబాబూ! టైమెంతయ్యుంటుంది.'' అడిగాడు పైడయ్య . నడుస్తూనే చేతి దీపంలో వాచీ చూసి ''పదిన్నర కావస్తోంది'' అని చెప్పి హేండ్ లాంప్‌ని సింహాచలానికి అందించేడు. ఇద్దరూ చీకట్లో గబగబా నడుచుకుంటూ వెళ్ళిపోయారు.

'' ఇక నేను ఎల్లాల, టైము దాటిపోతుంది.'' అని లేచి నిల్చుని సర్దుకున్నాడు పైడయ్య, సంచి భుజానికి తగిలించుకుంటున్నప్పుడు దాంట్లో పటాకీలు గలగలలాడాయి. ఆ చప్పుడికి కుక్క లేచి ముందు కాళ్ళు చాచి, ఆవలించి, ఒళ్ళు విరుచుకొంటూ పైడయ్య వైపు పరీక్షగా చూసింది.

స్టేషన్ రూంలో ఫోను మోత 'క్లిక్' మని ఆగిపోయింది.... 'హలో' కుట్టి గొంతు.

సెగమంట దగ్గర ఇద్దరు కూలీలు మాత్రమే మిగిలారు.

'' ఎల్తాన్రా. రాములు గాడు నాతో రాలేదన్న సంగతి ఎవరితోనూ చెప్పకండేం! ఇనస్పెట్టరు చెవిన పడిందంటే గొడవయిపోద్ది.'' అని లాంతరు తీసుకొని బయల్దేరాడు. కుక్క కూడా 'కుంయ్' కుంయ్' మంటూ మారాం చేస్తూ వెంబడించింది. పైడయ్య గసరినా వినడం లేదు.

''చలిలో సస్తావే..... నా వెంట ఎందుకే నిమ్మళంగా తొంగోకుండాను.'' అని దాన్ని వెంటబెట్టి తోలుతున్నాడు. అది పారిపోయినట్టే పారిపోయి మళ్ళీ కాళ్ళకి అడ్డం పడుతోంది.

''అది మరాగదు. నీతో కూడా పారొస్తాది.... తీసుకెళ్ళరాదా తోడుంటుంది'' అన్నాడు రంగడు మంట దగ్గర్నించి.

'' అసలే తిండి లేదు. దానికి తోడు సొట్టది. నడవలేదు. సరే నీ కరమ ! రా'' అని చిరాగ్గా

కుక్కని కసురుకుంటూ నడిచాడు.

చేతి లాంతరుతో పైడయ్యా, వెనకాల కుంటుకుంటూ కుక్క; సెగమంట వెలుగులోంచి చీకట్లో ప్లాట్‌ఫారం మీద నడుస్తున్నారు. స్టేషన్ మాస్టర్ గది దాటుతున్నప్పుడు, రూంలో నుంచి పడుతున్న వెలుగులో దూరంగా చీకట్లో కలిసిపోతున్న నీడల్లా కనిపిస్తున్నారు.

''ఒక్కడే బీటుకి పోతున్నాడు. భయం లేదా, ఇంత చీకట్లో ?'' అన్నాడు మంట దగ్గర గేంగోడు.

''ఆడికి భయమా! మొండోడు. ఎన్నిసార్లు ఒక్కడే ఎల్లేడో. లైను వోలు మొత్తం మీదున్న కానాలు , తూములు, కంబాలు, చెట్లు, తుప్పలు అన్నీ ఆడికి ఎరికే, నిద్దట్లో కూడా లెక్కెట్టేసి చెప్పేగలడు. పది సంవత్సరాలనుంచీ ఈ లైను మీదే తిరుగుతున్నాడు.'' అన్నాడు రంగడు.

పైడయ్య కుక్కతో ప్లాట్‌ఫారం చివరన గట్టు దిగాడు. సెగమంట వేడిలోంచి వచ్చిన శరీరం బయటి చలికి తట్టుకోలేకుంది. మరింత చలిగా అనిపించింది. మఫ్లర్ తీసి తలకు చుట్టుకున్నాడు.

చుట్ట వెలిగించి రైలు పట్టాలప్రక్కన నడుస్తున్నాడు.

వెలుగులోంచి చీకట్లోకి రాగానే మరింత చీకటి అనిపించినా రానురాను చీకట్లకి చూపు సర్దుకుంది. ఆ రైలుమార్గం పైడయ్యకి కొట్టిన పిండి. అంచేత చేతి లాంతరు వెలుగులో సిగ్నల్ తీగల్ని దాటుకుంటూ చీకట్లో తడుముకోకుండా నడుస్తున్నాడు. కేబిన్ దగ్గరకు రాగానే లోపల్నించి ఆయిలు, గ్రీస్ వాసనలు గుప్పున కొట్టాయి. కేబిన్ కిటికీలోంచి దీపం వెలుగు పడుతోంది. కిటికీ లోంచి కేబిన్ మేన్ పైకి తలపెట్టి కేబిన్ దాటుతున్న పైడయ్యని పలకరించాడు.

కుక్క అడ్డంగా ఉన్న సిగ్నల్ పాయింట్స్ మీదినుంచి ఎగిరి దాటబోతూ చీకట్లో తీగల్ని తన్నుకుని తూలిపోతూ తమాయించుకుంది. తీగలు ఒక దాన్నొకటి కొట్టుకుంటూ రాసుకుంటూ ''జింగ్'' ''జింగ్'' మని చేసిన శబ్దం తరంగాలుగా ఆ నిశ్శబ్దంలో తేలిపోతోంది. ఆ శబ్దానికి బెదిరి పోయిన కుక్క పైడయ్యని దాటుకుంటూ ముందుకు వచ్చి లైటు వెలుగులో కుంటుకుంటూ పరుగెత్తుతోంది.

కాళ్ళకి చెప్పులు లేవు పైడయ్యకి. మెట్లంగి రాళ్ళమీద నడకకి అలవాటుపడ్డ అరిపాదాలు మోటుదేరి కాయకాసినట్టుగా దృఢంగా ఉన్నాయి. నడుస్తున్నప్పుడు ఎగుడుదిగుడుల్లో పాదాలు తొట్రుపడడం లేదు. మనిషి లావుగా లేకపోయినా భూమి మీద పాదాల చప్పుడు స్పష్టంగా వినిపిస్తోంది.

రానురాను సిగ్నల్ దీపాలు చీకట్లో ఎర్రగా మెరుస్తూ దూరమవుతున్నాయి. దూరంగా స్టేషనులో దీపం, కేబిన్‌లోని వెలుగు అప్పటికే చాలా దూరంలో నడుస్తున్న పైడయ్యకి చిన్నవౌతూ కనిపించి, లైను మలుపు తిరగడంతో కనుమరుగయ్యాయి.

డిస్టెంటు సిగ్నల్ కూడా దాటాడు. అడవి ప్రారంభమయింది. రైలు లైను లోయలో ఉంది. చుట్టూ కొండలు, దట్టమైన అడివి . దారి పొడవునా కొండవాగుల మీదనుంచి గట్లు, వంతెనలు. కొండలమధ్య నుంచి కటింగులలోనుంచీ మెలికలు తిరిగిన రైలు లైను విస్తరించు కుంది.

రైలు గట్టు కిరువైపులా పల్లంలో జీబుగా పెరిగిన చెట్లలో నుంచీ లోయల్లో నుంచీ, రేగిన గాలులు దూసుకుంటూ వీస్తున్నాయి.

ఆకాశం తెరిపిస్తున్నా, కొండలమధ్య అడవిలో చిక్కుకున్న గాలులు తేమతేమగా ఉన్నాయి.

పైడయ్య లాంతరు కాంతిలో లైనుని పరీక్షిస్తూ నడుస్తున్నాడు. రైలు గట్టు ప్రక్కకాలి బాట మరీ ఇరుగ్గా ఉన్నా, కానాలు దాటవలసివచ్చినా, పట్టాలు ఎక్కి నడుస్తున్నాడు ఆకాశం మీద అక్కడక్కడ చుక్కలు పొడుస్తున్నాయి.

పైడయ్య నడుస్తున్నాడు. మనస్సులో ఆలోచనలు పరుగులెత్తుతున్నాయ్. '' ఇక మరో రెండు సంవత్సరాలు నడుస్తాను. తరవాత రిటైరైపోతాను....'' ఆలోచనలో పడ్డాడు. బ్రతుక్కేమీ ఫరవాలేదు. ఒంటరివాడిని . పించినీ చాలు. ఆ డబ్బు ఇస్తే ఎవరైనా చూస్తారు. ఎటొచ్చి ఒటీలులో తిండి పెట్టినట్టు పెడతారు. ముసిలి కాలంలో కాలూ చెయ్యా పట్టడానికి తోడెవ్వరూ లేరు'' అనుకున్నాడు. పెళ్ళాం జ్ఞాపకం వచ్చింది. '' దేవుడు దాన్ని తీస్కుపోయాడు. ముసిలి కాలంలో ఇలా వంటరిగా సచ్చిపొమ్మని నన్నొగ్గీశాడు'' గుండెల్లో దేవినట్టయింది.

''పోనీ కుర్రపొపడైనా మిగిలేడుకాడు'' అప్రయత్నంగా చుక్కల వెలుగులో కనిపిస్తున్న కొండ ల్లోకి చూశాడు. వెంట నడుస్తున్న కుక్క తుమ్మింది, మంచులో రొంపచేసినట్టు. ఆలోచనలోంచి తేరుకుని స్థిమితపడ్డాడు. బహుశా వంటరిగా ఉండడంవల్ల ఇలాంటి ఆలోచనలు వస్తున్నాయను కున్నాడు. పాత సంగతులు ఆలోచించడంవల్ల దిగులు తప్ప మరేవీ లేదనుకున్నాడు.

అలా ఆలోచించకూడదని కూడా అనుకున్నాడు, రేపటి గురించి కూడా ఆలోచించి బెంగ పెట్టేసుకోవడం మంచిది కాదనుకున్నాడు. '' ఏమిటయితే అదే కానీ . నేనా అలక్ నిరంజన్ గాణ్ణి...'' ఫక్ దిహెల్'' అని అనుకున్నప్పుడు ఫక్కున గట్టిగానే నవ్వేడు. తనలో తానే నవ్వుకుంటున్నందుకు మళ్ళీ నవ్వొచ్చింది. అప్పుడు పీటర్సు దొర, కుట్టి మేష్టరు గుర్తుకొచ్చారు. చిన్న సరదాలాంటిది కలిగింది.

'' ఫక్ ది హెల్ '' అని గట్టిగా అరుస్తూ పకపక మని నవ్వేడు, ఆ నవ్వు కొండల్లో ప్రతిధ్వనిస్తూ మార్మోగింది. కొండల్లో అణగారిపోతున్న నవ్వుల్ని వింటూ నడక సాగిస్తున్నాడు.

అడవి చిక్కబడుతోంది. చిమ్మటలు ''గీ'' పెడుతున్నాయి. రిట్టమానుచెట్టు దాటుతూ ఉంటే, మూడు సంవత్సరాల క్రితం పట్టపగలు అక్కడ గేంగోడిని పెద్దపులి ఎత్తుకుని అడవిలోకి పారిపోతూంటే, ఆడి అరుపులు అడివిలో చాలా దూరం వరకూ వినిపించాయి. అక్కడ పనిచేస్తున్న పైడయ్య కూడా విన్నాడు. ఆ ఆర్తనాదాలు జ్ఞాపకం వచ్చి బరువెక్కిన హృదయంతో నడుస్తున్నాడు.

ఇప్పుడు పులుల భయం లేకపోయినా ఎలుగుబంట్ల భయం ఉంది. అక్కడక్కడ ఎలుగు బంట్లు బీటుగేంగోళ్ళని, పెట్రోల్ మేన్‌లని అడపాదడపా మీదపడి బకిరేస్తుంటాయ్. ఈ అడివిలో దివిటీ వెలిగించి తీసుకెళ్ళాల్సిందనుకున్నాడు దివిటీ ఉంటే జంతు భయం ఉండదు.

రైలు లైను కటింగులోనికి ప్రవేశించింది. పైడయ్య కటింగులో అడుగు పెట్టగానే కటిక చీకటి ఆవరించింది. చీల్చిన కొండలోనించి వందగజాల పొడుగున పట్టాలు విస్తరించుకుని ఉన్నాయి. ఇరువైపులా ఎత్తైన కొండ గోడలు బాగా చెయ్యి చాస్తే తగిలేటట్టు భ్రాంతి కలిగించేటంత ఇరుకుగా ఉన్నాయి. చేతి లాంతరు వెలుగులో పట్టాల మీదనించి నడుస్తున్నాడు కటింగులో. ఆకాశం మీదికి తలెత్తి చూశాడు. ఆకాశం వైపు తెరుచుకున్న చీకటి ద్వారాల్లా ఉన్నాయి కొండ శిఖరాలు, ఆకాశం లో అక్కడక్కడ ఒకటి రెండు చుక్కలు చలిలో ఒణుకుతున్నట్లు మిలమిలలాడుతున్నాయి.

పైడయ్య అలికిడికి కాబోలు కొండ గోడలకి వేలాడుతున్న గబ్బిలాలు లేచి చీకట్లో దేవుళ్ళాడు

తున్న దెయ్యపు పిల్లల్లా కటింగ్‌లో అస్తవ్యస్తంగా ఎగురుతున్నాయి. వెనకాల కుంటుకుంటూ చీకట్లో తడుముకుంటూ తనని సమీపిస్తున్న కుక్కని దగ్గరగా పిలిచి ఒకరి నొకరు రాసుకుంటూ చీకట్లో కటింగు దాటుతున్నారు.

''అర్ధరాత్రి దాటిపోయింది''- అని అనుకున్నాడు పైడయ్య. కటింగు దాటాక, పల్లపు అడివి ప్రారంభమయింది. పట్టాలకి ఇరువైపులా రానురాను తుప్పలతోనూ, బండరాళ్ళతోనూ చిట్టడవి విస్తరించుకొని ఉంది. అక్కడక్కడా దూరంలో కొండవాలులలో మెట్ట భూవములు కూడావున్నాయి. కొండపంటల్ని కాపలా కాయడానికి వేసుకున్న అరపలమీద దీపాలు మసగ్గా కనిపి స్తున్నాయి.

పైడయ్య నడక సాఫీగా వేగంగా సాగుతోంది. మరో మైలు వరకూ తూములూ, కానాలూ, కటింగులూ తగలవు. ప్రక్క పొదల్లో ''క్రీచ్ కీచ్'' మని గింజుకుంటున్న అరుపు. గుడ్ల గూబ తుప్ప ల్లో ఎలకని వేటాడి గోళ్ళులో చిక్కించుకుని ఎగిరిపోతోంది.

ఆకాశం తెరిపిస్తోంది. నీటి మేఘాలు తెరలు తెరలుగా ఆకాశం మీద పరుగెత్తుతూ దూరంగా కొండల్లోకి పారిపోతున్నట్టున్నాయి. మబ్బులు పల్చబడుతూ విడిపోతున్నాయి.

నడుస్తున్న పైడయ్యకి రకరకాల ఆలోచన్లు వస్తున్నాయి. అక్కడ లైను పొడవునా ప్రతి చెట్టుకీ, గట్టుకీ ఏవేవో కథలు చెబుతూ ఉంటారు. ఆ బ్రిడ్జి క్రింద దెయ్యం ఉందని, ఆ లైను ప్రక్కన అమ్మోరు గజ్జల చప్పుడు వినిపిస్తూ ఉంటుందని, పట్టాలకి అడ్డంగా తాటి చెట్టు ప్రమాణంలో తాటి రాకాసి నించొని కళ్ల వెంబడి నిప్పులు కురిపిస్తుంటుందని రకరకాల కథలున్నాయి. ఆ ప్రాంతాలు దాటుతున్నప్పుడల్లా ఎంత ధైర్యవంతుడయినా పైడయ్య గుండెల్లోకూడా చిన్న బితుకు పుట్టేది. ధైర్యం కూడగట్టుకోడానికి పాటలు పాడేవాడు. కుక్కతో క బుర్లాడుతూ ఉండేవాడు.

''ఏనుగుల తూము'' దగ్గరౌతోంది. దూరంగా కొండల దిగువున అడివి పందుల్ని తోల డానికి డబ్బాలు వాయిస్తూ 'హేయ్' 'హేయ్' మని వేస్తున్న కేకలు స్పష్టాస్పష్టంగా గాలిలో తేలుతూ వినిపిస్తున్నాయి.

ఏనుగుల తూము దగ్గరికి వచ్చేసరికి కప్పల అరుపులు నలువైపులనుంచీ తారాస్థాయిలో వినిపిస్తూ చెవులు గింగుర్లెత్తిపోతున్నాయి. పైడయ్య తూముగట్టుమీద నిలబడి పరీక్షగా చూశాడు. తూము గట్టుకి ఎక్కడా గండి పడలేదు. లైను దిట్టంగానే ఉంది. లైను మీద నడుస్తూ ఇరుప్రక్కలా మెట్లంగిరాయి పేకింగు చూశాడు. సరిగ్గా ఉంది. గట్టిగా తుమ్మొచ్చింది. ఆ చప్పుడికి కప్పల బెక బెకలు ఠక్కున మీట నొక్కి నట్టు ఆగిపోయి ఒక్కసారి నిశ్శబ్దం ఆవరించుకొంది. క్రిందికి చూశాడు. తూముల్లోనించి నీరు పొర్లుతూ పారుతోంది. వర్షపు నీరు పాయలు పాయలుగా కొండల్లోనించి దిగి అడవిలో తుప్పల్ని దాటుకుంటూ ఏకమైపోతూ తూముల్లోనించి సుడులు తిరుగుతూ హొరుసుకుంటూ పరుగులు తీస్తూ పారుతోంది. తూముల దగ్గర ఏర్పడిన సుడి ఆ నిశ్శబ్దంలో 'గీ' మని అరుస్తూ ఒళ్ళు జలదరింజేస్తోంది.

''ఈ తూముకి ఎప్పుడూ ఢోకాలేదు. ఎంత పారినా వర్షం నీరేకదా. ఎటొచ్చీ 'ఎర్రి గెడ్డ' కానాయే చూసుకోవాల, అక్కడ మూడు గెడ్డలేకమైపోతాయి''- అని అనుకుంటూ నడక సాగిస్తున్నాడు.

ఏనుగుల తూము దూరమౌతోంది. తిరిగి కప్పల అరుపులు అక్కడక్కడ ఆరంభమై అంచె

లంచెలుగా మందలుగా అరుస్తున్న వాటి అరుపులు నడుస్తూ దూరమౌతున్న పైడయ్యకి వినిపిస్తున్నాయి. మబ్బులు తొలగిన నీలాకాశంలో చంద్రుడు కాంతి పుంజుకుంటూ తేలు తున్నాడు. దూరాన కొండల్లో కొండగొర్రె 'కార్' మని అరిచింది. ''మరి వర్షం రాదు. పూర్తిగా తేలిపోతోంది. అడవిలో జంతువులు కూడా బైటకు వస్తున్నాయి'' అని అనుకుంటూ నడుస్తు న్నాడు. వెన్నెల్లో తన నీడని చూసుకుంటున్నాడు. నున్నని రైలు పట్టాలమీద మంచుబొట్లు వెన్నెలలో ప్రతిఫలిస్తూ అక్కడక్కడా ముత్యాల్లా మెరుస్తున్నాయి. అప్పుడు అకస్మాత్తుగా కుక్క జ్ఞాపకం వచ్చింది. వెనక్కి తిరిగి చూశాడు. కుక్క పొదల్లో కుంటి కాలెత్తి ఉచ్చపోస్తోంది. మనస్సులో నవ్వుకున్నాడు. యజమాని వెనక్కి తిరగ్గానే కుక్క కుంటుకుంటూ పరుగెత్తుకుంటూ వచ్చి పైడయ్య మీదికి ఎగబాకబోతూ చేతి లాంతరు పైకప్పు చురుక్కుమని 'కంయ్' మని అరిచింది. ''పిచ్చిలంజ'' అని లాలనగా కొట్టి నడక సాగిస్తున్నాడు.

ఆకాశం మీద తెల్లటి గాజు పొర లాంటి తెలి మబ్బు చంద్రుణ్ణి దాటుతున్నప్పుడు దానిలో నుంచి ప్రతిఫలించిన చంద్రకాంతి మరింత తీక్షణంగా ఒక్కసారి వెలిగి కొండల్నీ, అడవినీ వెన్నెలతో ముంచెత్తేసింది.

బాండ్రు కప్ప అరుపు '' బార్ ! బార్! బిక్... బిక్'' మని వినిపించింది. మిగతా కప్పల బెకబెకల మధ్యలో దాని అరుపు బొంగురుగా వికృతంగా వినిపిస్తోంది.

''ఎర్రిగడ్డకానా'' దగ్గరపడుతోంది'' అనుకున్నాడు పైడయ్య. చలిగా ఉంటే బనీను సర్దుకున్నాడు.

నీరు పారుతున్న శబ్దం దగ్గరవుతున్న కొద్దీ హోరుగా వినిపిస్తోంది.

ఆకాశం మీదికి చూసి ఒంటి గంట దాటిందేమో అనుకున్నాడు.

కొండల మీద నుంచి మంచు తెర లోయల్లోకి పాకురుతూ దిగుతోంది.

కానా దగ్గరికి వచ్చేసరికి కానా క్రింద నీరు అల్లకల్లోలంగా గర్జిస్తున్నట్లు వినిపిస్తోంది. జల ప్రళయంలా ఉంది. ఆ నిర్జన ప్రదేశంలో జల ప్రవాహపు అలజడి గుండెల్ని అదర గొట్టేస్తోంది.

లాంతరు వత్తి పెద్దది చేసి కానా మీది స్లీపర్ల మీద దాటుతున్నాడు . కానా మొత్తం ఊగిపోతుందా అని భయం వేసింది. క్రింద నుంచి పారుతున్న నీరు, స్లీపర్ల సందుల్లోంచి వెన్నెల పడి, వెలుగు నీడల్లో వికృతంగా విలయ తాండవం చేస్తున్నట్లు పొంగి పొంగి పారుతోంది. ఎగిరిపడుతూ, గర్జిస్తోంది. వరద; కానా గట్టుని ఢీకొంటూ గుబేల్ ! గుభేల్ మని ఎగిరి పడుతూ, పిచ్చిగా సుడులు తిరుగుతూ హూంకరిస్తూ ప్రవహిస్తోంది. స్లీపర్లు దాటుతున్న పైడయ్య కాళ్ళు ఒణుకుతున్నాయి. బ్రిడ్జి క్రింద లోతుగా పారుతున్న జల ప్రవాహ వేగాన్ని చూడలేక పోతున్నాడు. అలా నడుస్తూనే లైనుని, కానాని పరీక్షగా చూస్తున్నాడు. ''ఫరవాలేదు, లైను దిట్టంగానే ఉంది'' అనుకున్నాడు.

బ్రిడ్జి మీద నుంచి కనుచూపు మేర వరకూ చూస్తున్నాడు. ఎర్రిగడ్డ వరద, వెన్నెలలో దూరంగా తళతళ మెరుస్తూ, ఆయాసంతో ఎగిరిపడుతూ, దగ్గరౌతూ , లుంగలు లుంగలుగా చుట్టుకుని పారుకొస్తూ, కానాలో ప్రవేశిస్తున్నప్పుడు గట్ల మధ్య ఇరుక్కుపోయి, రెచ్చిపోతూ, గట్లని ఢీకొట్టుకొంటూ, ఎగిసిపోతూ, బ్రిడ్జి స్థంభాలని గుద్దుకుంటూ, తోసుకుంటూ, శివాలెత్తినట్లు ఉరకలేస్తూ పారుతోంది.

దుంగలు, చచ్చిపోయిన జంతు కళేబరాలు, గడ్డి వేళ్ళతో తేలుతున్న చెట్లు, వరద ప్రవాహంలో కొట్టుకొస్తూ, స్తంభాలని ఢీకొంటూ, పల్టీలు కొడుతూ, గిరగిర తిరుగుతున్నాయి. దూరంలో నీరు కోసేసిన గెడ్డ ఒడ్డున తుప్పల్లో ఇరుక్కున్న గేదెపెయ్య కళేబరం వెన్నెట్లో కనిపిస్తోంది. వెన్నెల్లో ఒడ్డున వరద నీళ్ళ నురుగులు గట్లను నాకుతున్నాయి.

బ్రిడ్జి దిగి లాంతరు కాంతిలో డేంజరు మార్కు చూశాడు. ఎర్రగీత దాటలేదు.

– ఫరవాలేదు – అనుకున్నాడు. గట్టు ప్రక్క కానా హోరులో చెవులు వినిపించడం లేదు. లాంతరు వెలుగులో గట్టున రాళ్ళ సందుల్లోనుంచి పాములు తలలు బయటకు పెట్టి పలవల నాలికలు చాచుకుంటూ చూస్తున్నాయి. అక్కడ అలా వంటరిగా ఉండడం కొంచెం భయం వేసింది. గబగబా గట్టెక్కి వంతెన దాటుకుంటూ మధ్యలో ఆగాడు. కుక్క 'కుంయ్' కుంయ్'మని కానా దగ్గర అరుస్తోంది. కానా ఎక్కి స్లీపర్లు దాటబోతూ, క్రింద నీటి అలజడి చూసి అదిరిపోతూ, తోక ముడుచుకుని వెనక్కిపోతోంది. నిస్సహాయంగా అరుస్తోంది .

''సొట్టది! స్లీపర్లు దాటలేక జడిసిపోతోంది'' అని వెనక్కి వచ్చాడు. దీనంగా మొరుగుతున్న దాని కళ్ళల్లోకి చూశాడు. లాంతరు క్రింద పెట్టి కుడి చేత్తో దాన్ని అమాంతంగా ఎత్తుకుని; చంటి పిల్లలా చంకన వేసుకున్నాడు. బక్కగా ఉన్నా బరువుగా ఉంది. దాని శ్వాస కుక్క కంపు కొడుతోంది. ఎడమ చేతితో లాంతరు తీసుకుని కుక్కని మోసుకుంటూ దాని బరువుని తమాయించుకుంటూ, పట్టి పట్టి అడుగులు వేసుకుంటూ, స్లీపర్లు దాటుకుంటూ నడుస్తున్నాడు. వెన్నెలలో వంతెన మీద కుక్కతో నడుస్తున్న పైడయ్య చీకటితో చెక్కిన శిల్పంలా కనిపిస్తున్నాడు. అలా దాటుకుంటూ బ్రిడ్జి దాటాడు. కుక్కని దింపి తిమ్మి రెక్కుతున్న చేతుల్ని విదుల్చుకున్నాడు. కుక్క కూడా బద్ధకంగా ఒళ్ళు విదుల్చుకుంది.

పైడయ్యలాంతరుతో చుట్ట వెలిగించాడు. పొగ వదులుతూ కాస్సేపు వెన్నెలలోకి కొండలమీదికి చూస్తూ నిల్చున్నాడు. కుక్క 'గుర్ గుర్' మంటూ పట్టాల మీదికి దృష్టి కేంద్రీకరించు కుంటూ కోపంగా అరుస్తోంది. దాని మెడ మీద వెంట్రుకలు నిక్కబొడుచుకుని వెన్నెట్లో మెరుస్తున్నాయి. ఆవేశంతో ఒళ్ళంతా వణుకుతోంది. పళ్ళికిలించుకుంటూ దేనిమీదకో కలబడిపోతున్నట్లు ముందుకు అడుగులు వేస్తూ తమాయించుకుని కసిగా మొరుగుతోంది.

వెన్నెల వెలుగులో రైలుపట్టాల మీద నుంచి పేద్ద కొండచిలువ భారంగా పాకురుకుంటూ దాటుతోంది . అది చూసిన పైడయ్య కుక్క మెడమీద చర్మం పట్టుకుని ముందుకుపోకుండా అదుపు చేస్తున్నాడు. అది విదిలించుకోడానికి గింజుకుంటోంది. పట్టాలు దాటి తుప్పల్లోనుంచి జరజరమని పాకురుతున్న కొండ చిలువ శబ్దం దూరమౌతూ ఆగిపోయేవరకూ కుక్కని అలాగే పట్టి ఉంచాడు.

''వరదల్లో కొండచిలువ కొండల్లోనుంచి కొట్టుకొచ్చుంటుంది'' అనుకున్నాడు.

'' కుక్కలంజ సొట్టదైనా ఎంత పవురషం' అని మనస్సులో ముద్దుగా తిట్టుకుంటూ నడక ప్రారంభించాడు. ఎర్రి గడ్డకానాలో నీటి గర్జన రానురాను దూరమవుతోంది.

లైను గట్లు మీది నుంచి, సిమెంటు తూముల మీదినుంచి పట్టాల మీద ఎక్కుతూ దిగుతూ నడుస్తున్నాడు. చూపులైను మీద పరిశీలనగా పరుగెత్తుతోంది. పధ్నాలుగో నంబరు కల్వర్టు దగ్గ

రౌతున్నప్పుడు చిన్న మేష్టరు కుట్టి గుర్తుక'చ్చాడు. అక్కడ పట్టాలమీద కూర్చుని పిలుస్తున్న ఆడ దెయ్యంకూడా గుర్తొచ్చింది. గట్టిగాపాడడం మొదలెట్టాడు. పాడుకుంటూ, దగ్గుకుంటూ, గొంతు సర్దుకుంటూ, మళ్ళీ పాడుకుంటూ, కల్వర్టు దాటుతూ పక్కని పొదల్లోకి చూశాడు. పొదలికి అవతల చేలమధ్య నిలువెత్తు మానవాకారం! పిచ్చి పూలవాసన రివ్వున వీచింది. ఆడమత్తు ఉంది ! వళ్ళు జలదరించిపోయి అమాంతంగా పాట మధ్యలో ఆపి కళ్ళు మూసుకున్నాడు. గాజుల సవ్వడి గాలిలో తేలుతోంది. పరుగెత్తుదామనుకున్నాడు. కళ్ళు తెరిచి చూశాడు. వెన్నెల. అదే మానవాకారం జుత్తు విరబోసుకునుంది. నవ్వుతున్నట్లు కూడా అనిపించింది. వెనకన కుక్క ''భౌభౌ'' మని అరుస్తోంది. గాలితెర రివ్వున వీచింది. మానవాకారం 'కటకట' మని ఊగింది. దిష్టి బొమ్మ ! చెమటెక్కి పోయిన పైడయ్య నవ్వుకున్నాడు. తిరిగి నడక ప్రారంభించాడు.

రానురాను గాలిలో మార్పు వస్తోంది. చలి చిక్కబడి సూదుల్లా పొడుస్తోంది. గాలిలో తేమ వాసనలు తేలుతున్నాయి. వాసనల్ని గట్టిగా ముక్కుతో పీల్చి ముక్కు చిట్లించుకుంటూ ఆకాశం వైపు చూశాడు. వెన్నెల మసకేసి ఒక్కసారి చీకటి పడినట్టయింది. నల్లటి నీటి మేఘం చంద్రుని మీది నుంచి దాటుతోంది. దాని నీడ తుప్పల్లోనుంచీ పొదల మీదనుంచీ పాకురుకుంటూ దాటుతోంది. ఆకాశం మసగబడుతోంది.

అక్కడక్కడ మబ్బులు కూడా భారంగా కదుల్తున్నాయి. దూరాన కొండలు కనిపించటం లేదు, మబ్బులు కొండల్ని కప్పుకుంటూ ఆకాశం మీద విస్తరించుకుంటున్నాయి.

''ఈ అడివిలో ఎప్పుడు వర్షం వస్తాదో, ఎప్పుడు తేలిపోతాదో చెప్పలేం. అంతా నిమిషాలమీద జరిగిపోతాది. ఇంతవరకూ పుచ్చపువ్వుల్లా వెన్నెల కాసింది. మళ్లీ ఇప్పుడు మేఘాలా! అందుకే వాన రాకడ పేణం పోకడ ఎవరూ చెప్పనేరంటారు'' అని అనుకుంటూ ఆకాశం నలు వైపులా పరికిస్తూ అలుముకుంటున్న చీకట్లో నడుస్తున్నాడు.

ఆకాశం అంచులు మెరుస్తున్నాయి. కొండల్లో గుడగుడమని ఉరుముతోంది. 'వర్షం వస్తోంది.' అని గబగబా నడక సాగిస్తున్నాడు. నిమిషాలమీద ఆకాశం మసగబారిపోతూ, మబ్బులు కమ్ముకుంటూ చంద్రుణ్ణి కప్పేస్తున్నాయి. పొదలు, చెట్లు, ఊగుతున్నాయి. గాలి మెల్లమెల్లగా ఎక్కువవుతోంది. గాలిలో కొండల్లో నుంచి వర్షం వాసన. దూరంగా అడవిలో గలగలమని ఆకుల మీద పడిన చినుకులు తెరలు తెరలుగా దాటుకుంటూ దగ్గరౌతున్న కొద్దీ టపటపమని స్పష్టంగా వినిపిస్తున్నాయి.....

చినుకుల తెర దగ్గరౌతోంది. 'వర్షం కొట్టుకొస్తోంది' అని గబగబా నడుస్తున్నాడు పైడయ్య. చినుకుల తెర 'జాం' మ్మని ఈదురుగాలిలో కలిసిపోతూ పైడయ్యని దాటుకుంటూ అవతలివైపు చెట్లలోనించి దూసుకుపోయింది. ఆకాశం మీదనుంచి తెరలుదించినట్లు తెరలు తెరలుగా వర్షం గాలిలో చెదిరిపోతూ చెట్లలో నుంచి పిచ్చి గాలులతో ఊగిపోతూ ఉధృతంగా కొట్టోంది. రాను రాను కుంభవృష్టి. ఆకాశం మీద పాము నాలికల్లా మెరుపు చీలికలు. పైడయ్య తడిసి ముద్దయిపోతూ వణుకుతూ తలదాచుకోటానికి పరుగెత్తుకెళ్ళి దగ్గర్లో చెట్టుక్రింద నిల్చున్నాడు. కుక్క నీరుగారుతూ తోకముడుచుకుని పైడయ్య ప్రక్కనే ''కుంయ్ కుంయ్'' మంటూ దేవులాడుతోంది. చెట్టుక్రింద ఉన్నా ఒలిపిరి కొట్టేస్తూ తడుస్తూనే ఉన్నాడు. చెట్టు కొమ్మల్లోనుంచి

నీటిబొట్లు ముఖంమీద పడుతూ చికాకు పరుస్తున్నాయ్. అలా చాలాసేపు తడుస్తూ, వర్షాన్ని తిట్టుకుంటూ కుక్కని కసురుకుంటూ చెట్టుక్రింద నిల్చున్నాడు.

★ ★ ★

అలా అకస్మాత్తుగా వచ్చిపడిన వర్షం ఒక్క ఊపు ఊపి అంత త్వరగానూ వెలిసిపోతూ ఆవలివైపు అడవిని దాటుకుంటూ లోయల్లోకి వెళ్ళిపోయింది. రానురాను లోయల్లో వర్షం, గాలి ఊళల్లో కలిసిపోయి దూరమైపోయింది.

ముఖంమీద నీటిని మోచేత్తో తుడుచుకుంటూ తిరిగి నడక ప్రారంభించాడు. వర్షంలో తడిసిన తుప్పల్లోనుంచి చెట్లలో నుంచి బురదవాసన, పసరువాసన కొడుతోంది.

లైను మలుపు తిరిగింది. కుడివైపు ఎత్తయిన కొండలు, కొండలమీద పెద్ద పెద్ద బండ రాళ్ళు గాలితాకిడికి దొర్లిపోయేటట్టు ఒకదాన్నొకటి ఆనుకుని మబ్బుపట్టిన ఆకాశం మసగమసగ వెలుగులో నల్లగా తీర్చిదిద్దినట్లు నిటారుగా నిల్చునున్నాయి. ఎడమవైపు గట్టుని ఆనుకుని పెద్దలోయ.

పైడయ్య కొండవాలులో నడుస్తున్నాడు. పట్టాలమీద దీపం కాంతి తిప్పుతూ పరీక్షిస్తున్నాడు.

అలా నడుస్తున్న పైడయ్యకి క్షణం సేపు కళ్ళు చెదిరినట్టయింది. అవ్యక్తంగా వళ్ళంతా జలదరించింది. లైనుకి అడ్డంగా ఏదో ఉన్నట్టనిపించింది. 'వర్షం నీరు కళ్ళలో పడి దృష్టి చెదరడం లేదు కదా?' అనుకున్నాడు. లాంతరుపైకెత్తి చీకట్లో కళ్ళు చీపిగా చిట్లించి చూసాడు. దీపం వెలుగులో దూరంగా పట్టాలమీద పేద్దబండ రాయి అడ్డంగా పడుంది. పైడయ్య ఒక్కసారి బెంబేలెత్తిపోయి పట్టాలమీద పరుగెత్తుకుంటూ రాయిని సమీపించాడు. కొండల మీదినుంచి దొర్లిన బండరాయి మొత్తం పట్టాలకి ఇరువైపులా ఆవరించేసుకుంది. చిన్న సైజు కొండలా ఉంది. రాయి మీద అప్రయత్నంగా చెయ్యి వేశాడు. చలి పిడుగు తాకినట్లు ఒళ్ళంతా జివ్వుమంది. చాలా ఎత్తునుంచి దొర్లిపడటం వల్ల రైలు పట్టాలు వంగిపోయి మెలికలు తిరిగి పోయున్నాయి. స్లీపర్లు నుగ్గునుగ్గు అయిపోయున్నాయి.

'ఇప్పుడు ఏం చేసేది?' అనుకుంటూ పిచ్చిగా ఆ రాయిచుట్టూ తిరుగుతున్నాడు. వెర్రెత్తినట్టు మెట్లంగి రాళ్ళ మీద అటూ ఇటూ పరుగెత్తుతున్నాడు .

'' డేంజర్!'' ఒక్కసారి బుర్రలో ఫ్లాష్ అయింది - అపాయాన్నుంచి కాపాడాలి - రైలుబళ్ళు అటూ ఇటూ రాకుండా ఆపెయ్యాలి. లేకపోతే రైలు రాయిని ఢీకొని పట్టాలు తప్పి దొర్లిపోతుంది - ప్రక్కనే లోయ - రైలు అగాధాలలోతుల్లోకి దొర్లిపోతుంది, అమ్మో ! అనుకున్నాడు.

ముందుకు లైన్లమీద పరుగెత్తాడు. ఎదురుగా వచ్చే బళ్ళకి అపాయం హెచ్చరిక కోసం అలా వందగజాలు పరుగెత్తి అటునుంచి వచ్చే డ్రయివర్‌కి దూరాన్నుంచే ఎర్రదీపం కనిపించేటట్టుగా హేండ్ లాంప్ ఎర్రరంగు మార్చిగట్టు ప్రక్కన పెట్టాడు. తిరిగి వచ్చి పటాకీలు పెడదామని వచ్చిన దారినే వెనక్కి మళ్ళీ రాయిని దాటుకుని అవతలి వైపు పరిగెత్తుతున్నాడు. చేతిలో దీపం లేదు. చీకట్లో లైన్ల మీద పరుగెత్తుతున్నాడు. చీకట్లో గట్టు ప్రక్కన మసగ్గా కనిపిస్తున్న టెలిగ్రాఫ్ స్తంభాలని అంచనాగా లెక్క పెట్టుకుంటూ తొమ్మిదో స్తంభం దగ్గర్లో ఫాగ్ సిగ్నల్ని . (పటాకీని) పట్టాలకి అమర్చాడు. తిరిగి అదే పరుగు..... మరో తొమ్మిది స్తంభాలు దాటి కమ్ములకు వరసగా మూడు

పటాకీలని బిగించాడు. ‘ ఇటు కాపు కాసేశాను. ఫరవాలేదు. పటాకీలు పేలి బండిని ఆపేస్తారు. ఇటువైపు బండికి డోకా లేదు. ఇక అటువెపుకాయాల’ అని గాలిలా వెనక్కి తిరిగి పరుగు పరుగున టెలిగ్రాఫ్ స్తంభాలు దాటుకుంటూ , రాయిని చుట్టు తిరిగి, వచ్చిన దారెనే ఎదురుగా పరుగెత్తుతూ గట్టు దగ్గర ఎర్ర లాంతర్ని తీసుకుని, పటాకీలు బిగించడానికి ముందుకు పరుగెత్తుతున్నాడు. చీకట్లో తెల్లతెల్లగా మసగ్గా కనిపిస్తున్న టెలిగ్రాఫ్ స్తంభాలని లెక్క బెట్టుకుంటూ పరుగెత్తుతున్నాడు. వెనక్కి తిరిగి చూశాడు . ‘ఫరవాలేదు ఈ దూరంలో పటాకీ తగిలించొచ్చు’ననుకున్నాడు. కమ్ములమీద పటాకీ పెట్టి పట్టీలు నొక్కి తగిలించాడు. తిరిగి పరుగెత్తుతున్నాడు. ఉజ్జాయింపుగా మరో తొమ్మిది కంబాలు దాటాల. ఆకాశం మేఘావృతంగా ఉంది . చీకటిబాగా వ్యాపించు కొనుంది. మంచు కూడా కురుస్తోంది.

ఎర్రలాంతరు వెలుగులో చీకట్లో తడుముకుంటూ పరుగెత్తుతున్నాడు. ఒగరు స్తున్నాడు. ఇంకా చాలా దూరం పరుగెత్తాల..... ఒక కంబం దాటి పోయింది. అలా పరుగెత్తుతున్న పైడయ్యకి దూరంగా కొండల్లో వెలుగు కనిపించింది. హఠాత్తుగా ఆగిపోయాడు. అది రైలు ఇంజనువెలుతురు... కొండల్లో నుంచి ఆకాశం మీదికి పడుతూ స్పష్టంగా కనిపిస్తోంది. ఫాగ్ సిగ్నల్స్ అమర్చడానికి ఇంకా ఎనిమిది కంబాలు దాటాల. మెడలో మఫ్లరు తీసి నడుంకి గట్టిగా కట్టుకున్నాడు.

రెడ్ లైట్‌ని ఊపుకుంటూ రైలు పట్టాల మధ్యనించి పరుగెత్తుతున్నాడు పైడయ్య. ఆయాసంతో జాపోస్తున్నాడు. రాళ్ళని తన్నుకుంటూ స్లీపర్లని దాటుకుంటూ తూలుకుంటూ పరుగెత్తున్నాడు. పాదాలు చీరుకు పోతున్నాయి. అంతచలిలోనూ చెమటలు పట్టేస్తున్నాయి.

ఇంజను లైటుకాంతి దూరంగా కొండల్లోనుంచి చీకట్లో చిమ్ముకుంటూ దగ్గరౌతోంది.

రెండో స్తంభం దాటాడు. లోయలో నుంచి బండి దాటుతోంది. కొండల మధ్యలో ప్రతిధ్వ నిస్తున్నరైలు శబ్దం దూరంనుంచి స్పష్టాస్పష్టంగా వినిపిస్తోంది. పరుగెత్తుతున్న పైడయ్య ఒక క్షణం సేపు ఆగి చెవులు రిక్కించి విన్నాడు. పడుకుని రైలు పట్టాలమీద చెవిపెట్టి ఆలకిస్తున్నాడు. ధ్వని తరంగాలు పట్టాలలోనుంచి వినిపిస్తున్నాయి. పట్టాలు అదురుతున్నాయి. కొండల్లో నించి రైలు శరవేగంతో దూసుకువస్తోంది. పైడయ్యలేచి ఎర్రదీపంతో మళ్లీ పరుగు.

మూడో స్తంభం దాటాడు.

దూరంగా ‘బోఁయ్’ మన్న డీజిల్ ఇంజను అరుపు పైడయ్య గుండెల్లోనుంచి ఒక్కసారి దూసుకు పోయినట్లయింది. ఒండి కటింగులోకి వచ్చేసింది..... ఘీంకరిస్తూ కటింగు దాటు తోంది.

నాలుగో స్తంభం దాటబోతూ ఆగాడు. తొమ్మిదో స్తంభాన్ని ఎలాగూ అందుకోలేడు. ఎందు కైనా మంచిదని అక్కడే మరో ఫాగ్ సిగ్నల్ బిగించాడు. ‘భగవంతుడా నీదే భారం’ అనుకుంటూ ముందుగానే డ్రైవర్ని హెచ్చరించాలని పరుగెత్తుతున్నాడు.

తనతో తనవెనకాలే పరుగెత్తుకుని వస్తున్న కుక్కని గమనించలేదు. తన దృష్టినంతా వస్తున్న రైలుమీదే కేంద్రీకరించుకుంటూ పరుగెత్తుతున్నాడు.ఎలాగైనా రైలును ప్రమాదంనుంచి కాపాడాలి.. వెనకాలే కుంటుకుంటూ పరుగెత్తుకొస్తున్న కుక్క అప్రయత్నంగా పైడయ్య కాళ్ళలో పడింది .

పైడయ్య తూలిపోతూ తమాయించుకున్నాడు. పట్టరానికోపంతో రెచ్చిపోతూ బూతులు తిడుతూ దాన్ని కాలితో బలం పూర్తిగా తన్నాడు. అది 'కంయో' అని అరుచుకుంటూ పట్టాల అవతలకి చీకట్లో ఎగిరిపడింది.

బండి గాలిలా కొట్టుకొస్తోంది. మలుపు తిరిగింది. అంతే! ఒక్కసారి ఇంజన్ హెడ్‌లైట్ కాంతి దూరంలో జిగేల్‌మంది. వెలుతురు చిమ్ముకుంటూ చీకట్లని చీల్చుకుంటూ, తీక్షణమైన వెలుగుతో రైలు పట్టాలమీద దూసుకుంటూ నల్లటి రాక్షసిలా ఉరకలేసు కొచ్చేస్తోంది. ఎదురుగా పైడయ్య ఎర్రదీపాన్ని కిందికీ మీదకీ ఊపుతూ పిచ్చికేకలేస్తూ పరుగెత్తుతున్నాడు. ఇంజను వెనకాల పెట్టెల్లోనించి దీపాల వెలుగుకూడా కనిపించింది. ''అమ్మో! పాసింజరు బండి. జనం!'' అని ఒణికిపోతూ తొట్రుపాటు పడిపోతూ ఇంకా తొందర తొందరగా రైలు పట్టాల మధ్యనుంచి పరుగెత్తుతున్నాడు.

హెడ్‌లైట్ కాంతిలో, దట్టంగా కురుస్తున్న పొగమంచులో, దూరంగా రైలుపట్టాల మీద, పరుగెత్తు తున్న పైడయ్య డేంజర్ లైట్ ఎర్రటి నక్షత్రంలా దృశ్యాదృశ్యంగా కనిపించింది డ్రైవర్‌కి.

డ్రైవరు అనుమానంగా తదేకంగా చూస్తూ సీట్లోంచి లేచాడు. మంచుపొరల్లో నించి చెదురుతూ ఊగుతూ ఎర్ర దీపం దగ్గరౌతోంది. 'రెడ్‌లైట్' అరిచాడు అసిస్టెంటు.

''డేంజర్'' డ్రైవరు గుండె ఒక్కక్షణం లయతప్పినట్టయింది. అప్రయత్నంగా రైలు వేగాన్ని అదుపు చెయ్యడానికి ఆటోహేండిల్ అందుకున్నాడు. డేంజర్ విజిల్ అదేపనిగా కొట్టుకొస్తున్నాడు.

నిశ్శబ్దం ఆవరించుకున్న కొండల్లో రైలు అరుపులు గింగుర్లెత్తిపోతున్నాయి.

రంకెలు వేసుకు వస్తున్న ఇంజనూ, వెనకాల దడదడ మంటూ పరుగెత్తుతున్న పెట్టెల కుదుపు తోనూ వేగంతోనూ పట్టాలు ఊగుతున్నాయి.

రైలు దూసుకు వచ్చేస్తోంది. టెలిగ్రాఫ్ స్తంభాలు, చెట్లు, తుప్పలూ హెడ్ లైటు వెలుగులోనించి మెరుపుల్లా చీకట్లోకి మాయమవుతున్నాయి.

స్పీడు కంట్రోలవుతున్నా డౌను గ్రేడియంట్ కావడం చేత ఇంకా బండి పరుగెత్తుతూనే ఉంది. డ్రైవరూ, అసిస్టెంటూ, బండిని అదుపులోకి తేవడానికి విశ్వప్రయత్నం చేస్తున్నారు... ఆఖరి ప్రయత్నం గా ఎమర్జెన్సీ బ్రేక్ వేశారు.... మెల్లమెల్లగా వాక్యూం పడుతోంది. బ్రేకులు 'క్రీచ్ క్రీచ్' మంటున్నాయి.

రైలు, ఇంకా పరుగెత్తుతూనే ఉంది. మరీ దగ్గరయి పోయింది.

పైడయ్య ఆఖరిసారిగా పిచ్చిగా ఎర్రదీపం అదేపనిగా ఊపి ఊపి పట్టాల ప్రక్కకి గంతేసి తప్పు కున్నాడు.

''ఝూం'' మ్మని ఇంజను పైడయ్యని దాటింది. ఇంజన్‌లో నుంచి డ్రయివర్ తల పైకి పెట్టి '' క్యాహై'' అని గట్టిగా అరిచాడు.

''పట్టాలమీద పెద్దరాయి.... కొండ రాయి.... ఆపు బాబూ.... డేంజరు!'' అని బలం పూర్తిగా అరుస్తూ ఇంకా బాగా వినిపించాలని రైలుతో పాటు పరుగెత్తుతూ అరుస్తున్నాడు.

పిచ్చిగా ఇంజను దూసుకుంటూ దాటిపోతోంది.

''ధడ్.... ధడ్.... ధడ్...... ధడ్'' పెట్టెలు ఊగుతూ దాటుతున్నాయి. పెట్టెల్లోనుంచి పడు

తున్న వెలుగు నీడలు తెరలు తెరలుగా ప్రక్కనే పరుగెత్తుతున్న పైడయ్యమీద నుంచి దాటుతున్నాయి. కళ్ళు చెదురుతున్నాయి. పైడయ్య అరుస్తూనే వున్నాడు. పరిగెత్తుతూనే వున్నాడు.

రైలు గోల. దూకుడు . ఊపు . అదురు , పట్టాల మీద చక్రాల రాపిడి ; పైడయ్య అరుపుల్ని మింగేస్తున్నాయి.

వెనకపడిపోతున్న పైడయ్యా పరుగు ...అరుపులు.. పరుగు... పరుగు... ఆయాసం... ఎగూపిరి... పరుగు.. పరుగు.... అడ్డంగా రాయి.... అమాంతం తూలి పోయాడు.... చావుకేక.... ఢాభ్ - అంతే . ఆఖరి కేక చక్రాల క్రింద నలిగిపోయింది. రైలు చక్రాల క్రింద ముక్కలైపోయి, ఇరుక్కుపోయి, పీలికలై పోయి, ముద్దలు ముద్దలుగా తుళ్ళి పోయింది పైడయ్యా శరీరం.

చీకట్లో చిందిన నెత్తురు మీదినించి పరుగుతీస్తూ, ఘీంకరించుకుంటూ రైలు దాటిపోయింది. చివర గార్డు పెట్టి వెనకాల ఎర్రదీపం చీకట్లో దీనంగా వెలవెలబోతూ దూరమై పోయింది..... అంతా చీకటి.....

చక్రాలకి మరింత బిగుసుకుంటున్న బ్రేకులు బాధగా అరుస్తున్నట్లు క్రీచ్.... క్రీచ్.... మని ఈడుస్తున్నాయి.

'ధూం' చీకట్లో చక్రాల క్రింద మెరుపుతో శబ్దం.... ఫాగ్ సిగ్నల్ పేలింది . కొండల్లో నించి ప్రతిధ్వనించింది.

రైలు వేగం రానురాను మందగిస్తోంది.

'ధూం' మరో ఫాగ్ సిగ్నల్ పేలింది. రైలు కుదుపుకుంటూ ఆగిపోయింది.

డ్రైవరు దిగాడు. వెనకాల నించి గార్డు దిగి టార్చిలైటు వేసుకుంటూ ట్రాక్‌ని, పెట్టెలని చూసు కుంటూ ఇంజను దగ్గర కొచ్చాడు. పెట్రోల్‌మేన్ ఊపిన డేంజర్ సిగ్నల్ గురించి, దాన్ని చాలా దూరం నుంచే చూసుకొస్తున్నట్టు; వివరంగా చెప్పుకొచ్చాడు డ్రయివర్ గార్డుకి.

''ఫాగ్ సిగ్నల్స్ కూడా పెట్టేడే ! ఇంతకీ ఈ పెట్రోల్ మేన్ ఎక్కడ?'' అని గార్డు వెనకాల టార్చి వేసి అటూ ఇటూ తిప్పాడు. మంచు దట్టంగా కురుస్తుండడం వల్ల టార్చి లైటు కాంతి దూరంగా పడడం లేదు. ఎక్కడా గట్టు ప్రక్కన మనిషిగాని ఎర్రలాంతరుకాని కనిపించలేదు.

'' బాగా వెనకబడి పోయుంటాడు. డౌన్ గ్రేడియంట్‌లో బండి ఒకంతట కంట్రోలు అవ్వలేదు. పదండసలు, ఏమిటయిందో చూద్దాం. లైనుగాని వర్షానికి కోసేసిందేమో'' అన్నాడు డ్రైవరు.

'' నేను రియర్ లో కాషన్ గా ఫాగ్ సిగ్నల్స్ పెట్టి వస్తాను. మీ అసిస్టెంటుని ఫాగ్ సిగ్నల్సు తో ముందుకు పంపి లైన్ మీద పెట్టించి ఫ్రంట్ సైడ్ ప్రొటెక్టు చేయించండి . అసలు అబ్‌స్ట్రక్షన్ పాయింట్ ఎక్కడుందో చూడమని చెప్పండి'' అన్నాడు గార్డు.

ఫాగ్ సిగ్నల్సుతో అసిస్టెంటు డ్రయివరూ, గార్డు ; ముందుకీ వెనక్కీ పరిగెత్తారు. గార్డు పటాకీలు తగిలించి తిరిగి ఇంజను దగ్గరికి వచ్చేసరికి డ్రయివరు, అసిస్టెంటు చాలా ఎక్సైటింగ్ గా మాట్లాడుతున్నారు. అక్కడక్కడ పెట్టెల్లో నుంచి దిగిన ప్రయాణీకులు కూడా మెల్లమెల్లగా ఇంజను దగ్గరకు వచ్చి ఆ సంభాషణల్లో పాల్గొంటున్నారు. అందరి ముఖాల్లో ఆశ్చర్యం, భయం, టెన్షను కొట్టొచ్చినట్టు కన్పిస్తున్నాయి.

చాలా పెద్ద బౌల్డరు (బండరాయి) ట్రాక్‌కి అడ్డం పడిపోయింది, ట్రాక్ పూర్తిగా పాడయి పోయింది. పెట్రోల్ మేన్ ఫాగ్ సిగ్నల్స్ ముందుగానే పెట్టేసున్నాడు'' అని చెప్పాడు అసిస్టెంటు అప్పుడే వచ్చిన గార్డుతోనూ, గమిగూడిన ప్రయాణీకులతోనూ.

'' మైగాడ్! కొద్దిక్షణాల్లో మేజర్ ఏక్సిడెంటు ఎవర్టు అయిపోయింది.... ఎన్ని ప్రాణాలు పోయుణ్ణో'' అన్నాడు డ్రైవరు హెడ్‌లైటు కాంతి పరుచుకున్న సుదీర్ఘమైన లైను మీదికి చూస్తూ

అంతవరకూ నిశ్చేష్టుడిగా నిలబడిపోయిన గార్డు ఈ వార్త హెడ్ క్వార్టర్సు కంట్రోల్‌కి తెలియ పర్చడానికి వెనక్కి నడుస్తూ, మధ్యలో ప్రయాణీకులు వేస్తున్న ప్రశ్నలను సరిగ్గా వినిపించుకోకుండా తన వేను ఎక్కి ఎమర్జన్సీ టెలిఫోను పెట్టె తీశాడు. దగ్గరలోనున్న టెలిగ్రాఫ్ స్థంభం దగ్గరకు వెళ్ళి అసిస్టెంటు డ్రయివరు టార్చి వేస్తుంటే స్తంభం ఎక్కి టెలిఫోన్ తీగలు తగిలించాడు, ఇరువైపుల స్టేషన్లకి ఫోను చేసి తప్పిపోయిన ప్రమాదం గురించి చెప్పేడు. లైను మీద బళ్ళు విడిచిపెట్టకుండా బ్లాక్ చెయ్యమని హెచ్చరించాడు. వెంటనే హెడ్ క్వార్టర్సు కంట్రోలుకి కనక్ట్‌చేసి ప్రమాదం గురించి, అబ్‌స్ట్రక్షన్ గురించి వివరంగా చెబుతూ రిలీఫ్ ఆపరేషన్ల గురించి తక్షణం ఏర్పాట్లు చెయ్యమని చెప్పేడు.

ఆ వార్త అందుకోగానే కంట్రోలు రూంలో ఒక్కసారి అలజడి ప్రారంభమయింది. కంట్రోలర్ ఆవార్తని హుటాహుటిగా ఆపరేటింగ్, ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీర్లకి, ఆఫీసర్లకి, డి. ఆర్. ఎం. కి ఫోన్లమీద ఫోన్‌లు చేస్తూ చెప్పేడు. ఆఫీసర్ల ఇళ్ళకి ఆ రాత్రి జీపులు బయలు దేరాయి. మంచి నిద్రలో ఫోన్ రింగులకి లేచిపోయారు. ఆఫీసర్లు ఆ మెసేజ్ అందుకుని వాళ్ళ సబార్డినేట్స్‌కి ఫోన్ చేస్తూ కంట్రోల్ రూమ్ దగ్గరకు తక్షణం బయలుదేరి రమ్మని ఆదేశిస్తూ జీపుల మీద కంట్రోల్ రూం కి పరుగులు తీశారు.

అంత వరకూ రైలు దగ్గరికి పెట్రోల్ మాన్ రాకపోవడం వల్ల డ్రయివరుకు, గార్డుకీ చిన్న అను మానం కలిగింది. '' ఇంతవరకు రాలేదేమిటి చెప్మా. పదండి ఒకసారి అలా చూసివద్దాం.'' అన్నాడు గార్డు. గార్డు, అసిస్టెంటు డ్రైవరూ అక్కడ చేరిన మరో ఇద్దరు ప్రయాణీకులూ, టార్చి లైట్లు వేసుకుంటూ తిప్పుకుంటూ బయలుదేరారు. రైలు పట్టాల మీదా చుట్టుపట్లా పెట్రోల్ మేన్ కోసం వెతుకుతున్నారు. అలా కొంత దూరం నడిచేసరికి పట్టాల మీద ఏదో నల్లటిది కనిపించే సరికి దగ్గరగా వెళ్ళి లైటు వేసి చూశాడు. మనిషి తల వెంట్రుకలు చర్మంతో పట్టాలకు అంటుకుని ఉన్నాయి.

'' మైగాడ్ ! రన్ ఓవరయిపోయాడు. చచ్చిపోయాడు......... ప్రక్కనే పరుగెత్తుతూ దేన్నో తన్నుకుని ఉంటాడు. ఆ స్పీడుకి బండి క్రిందికి లాగేసింది'' అన్నాడు అసిస్టెంటు డ్రైవరు.

మరి కాస్తంత దూరంలో మాంసం ముద్దలు, పేగులు... తెగిపోయిన పాదం ... మెదడు తుళ్ళి పోయి ముద్దలు ముద్దలుగా పడుంది. ఇంకాస్త దూరంలో అడ్డంగా తిరిగిపోయిన గుండెలోనించి బయటకు వచ్చేసిన గుండెకాయ. ఊపిరితిత్తులు – భయంకరంగానూ, జుగుప్సాకరంగానూ ఉంది... చీకట్లో ఆ దృశ్యం మరి చూడలేక '' లెటజ్ గో బేక్.'' అన్నాడు గార్డు.

కంట్రోల్ రూం హడావిడిగా ఉంది. కంట్రోల్ రూంలో ఎమర్జెన్సీ మీటింగు జరుగు తోంది. ఫోన్లు మీద ఫోన్లు రింగవుతున్నాయి. ఇరు వైపులా స్టేషన్లలో బళ్ళు నిలుపు చెయ్యమని కంట్రోలు

నుంచి ఆదేశాలిచ్చారు. దగ్గర్లో ఉన్న పి. డబ్ల్యు. ఐ కి ఇంజనీరింగు గేంగులకి స్పాట్ చేరుకొమ్మని ఆర్డరు ఇచ్చారు.

సైరన్ మూడుసార్లు అరిచింది. బ్రేక్ డౌను గేంగు తయారయి సిద్ధపడిపోయింది. అవసరమైతే బండరాయిని తొలగించడానికి క్రేన్ కూడా సిద్ధమయింది. గంట వ్యవధిలో ''రిలీఫ్ స్పెషల్'' ఆఫీసర్లతో పరికరాలతో, కూలీలతో అబ్‌స్ట్రక్షన్ స్పాటుకి హుటాహుటిన బయలుదేరింది.

తెల్లవార్లూ బండిలో ఎవరూ నిద్రపోలేదు. కిందికి దిగి జట్లు జట్లుగా ప్రయాణీకులు మాట్లాడుకుంటున్నారు. ఏనోటవిన్నా పెట్రోల్‌మేన్ గురించే మాట్లాడుకుంటున్నారు. వాడి చావుని దీనాతిదీనంగా చెప్పుకుంటున్నారు. ప్రమాదాన్ని ఆపడంలో వాడు కనబరచిన ధైర్యాన్ని సాహసాన్ని, ప్రాణత్యాగాన్ని మెచ్చుకుంటూ బాధపడుతున్నారు.

దూరంగా కొండల మీద ఆకాశం తెల్లబడుతోంది. తెల్లవారుజాము మంచుకురుస్తూ, చలి వణికించేస్తోంది. అడివిలో అక్కడక్కడా మేల్కొన్న పిట్టలు అరుస్తున్నాయి. వెలుగొస్తోంది. మసక వెలుగులో చెట్లు, కొండలు, విడుతున్న మంచు తెరలో నుంచి దృశ్యాదృశ్యంగా కని పిస్తున్నాయి.

''ధూమ్... ధూమ్... ధూమ్'' మని ఫాగ్ సిగ్నల్సుని తొక్కుకుంటూ మోటారు ట్రాలీ దూసుకు వచ్చింది. పి.డబ్ల్యు. ఐ. ''స్పాట్ ఇన్‌స్పెక్షను'' చేస్తున్నాడు. బండరాయిని గేంగోళ్లు కదల్చ లేరు – అని నిర్ధారణ కొచ్చారు. వెంటనే ట్రాలీలు, రిలీఫ్ స్పెషలు, సాల్వేజి ట్రెయినూ ఒకటి తరువాత ఒకటి ప్రమాదస్థలానికి చేరుకున్నాయి. ఇంజనీర్లు, ఆఫీసర్లు, ఇన్‌స్పెక్టర్లు, గేంగుకూలీలు, మెకానిక్‌లు గోలగోలగా దిగారు. బండరాయిని, అది దొర్లడం వల్ల చెడిపోయిన ట్రాక్ నీ ఇన్‌స్పెక్టు చేస్తున్నారు. రెండు రోజుల నుంచి పడిన వర్షాలవల్ల రాయి స్లిప్ అయింది. వెంటనే బండని తొలగించి చెడిబోయిన పట్టాల స్థానే కొత్త ట్రాక్ వెయ్యడానికి ఇంజనీర్లు ఆదేశాలిచ్చారు.

సామాన్లు, పరికరాలు యుద్ధ ప్రాతిపదికమీద సమకూరుస్తున్నారు. ఫోన్‌ల మీద తెప్పిస్తున్నారు. టెంటులు వేశారు. పని ప్రారంభమయింది.

బాగా పొద్దెక్కింది.

పెట్రోల్‌మేన్ పైడయ్య సంగతి విని పెద్దాఫీసరుగారు చాలా బాధపడ్డారు. రైల్వే తరపున కాంపెన్సేషన్‌తోపాటు వాడి కుటుంబానికి పెద్దమొత్తంలో బహుమతిని అందజెయ్యడానికీ వాడి పిల్లల్లో ఎవరికైనా ఉద్యోగం ఇవ్వడానికీ తక్షణం ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారు. అక్కడున్న గేంగు కూలీలు, ఇనస్పెక్టరు పైడయ్యకి నా అన్నవాళ్ళు ఎవరూలేరని చెప్పేసరికి 'పూర్‌ఫెలో' అని పెదవి విరిచి బాధగా పైడయ్య రన్ ఓవర్ అయిపోయిన స్పాటు చూడ్డానికి అందరూ బయలు దేరారు.

మానవ కళేబరం అవశేషాలు, నెత్తుటి ముద్దలు, మాంసం కండలు పట్టాల మీద, గట్టు ప్రక్కనా; పది గజాలదూరం వరకూ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. పైడయ్య చేతి లాంతరు విరిగిపోయి తుప్పల్లో పడుంది. పట్టాల మీద ఎండిపోయిన నెత్తురు నల్లగా అట్టకట్టుకునుంది.

అందరూ నిశ్శబ్దంగానూ, మౌనంగానూ అలా చూస్తుండగా వెనకాలనుంచి మలయాళ కుట్టి అప్పుడే ట్రాలీదిగి ఒగరుస్తూ, పరుగెత్తుకుంటూ వచ్చాడు. తూలిపోతున్నాడు. తన కంటి ముందు చెల్లా చెదురుగా పడున్న పైడయ్య శరీర అవశేషాల్ని చూసి ఒక్కసారి అరవబోయి నోరు తెరిచి పిచ్చి చూపులు చూస్తూ కుప్పగా కూలిపోయాడు. అందరూ కలసి కుట్టిని లేవనెత్తి ముఖానికి నీళ్ళ

కొట్టి పడుకోబెట్టారు. తెలివిలోకి వచ్చి వికావికలైపోతూ గొల్లున ఏడుస్తున్నాడు. బెక్కు తున్నాడు. అలా పైడయ్య అవశేషాల వైపు చూస్తూ అక్కడే వుండి పోయాడు.

పని ప్రారంభం అయింది.

''గుభ్''......''గుభిల్''.....''ధూమ్'' బ్లాస్టింగ్ చేస్తున్నారు. కదపడానికి వీలు పడని కొండ రాయిని మందు పెట్టి పేల్చేస్తున్నారు. గునపాలు, పారలు, సమ్మెటల చప్పుళ్ళు . పాడైపోయిన లైనుని తొలగిస్తున్నారు. కొత్త పట్టాల్ని, స్లీపర్లని బిగిస్తున్నారు. మెట్లంగి రాయి పేకింగు చేస్తున్నారు. చకచకా పని సాగిపోతోంది. గంట గంటకీ వర్క్ ప్రోగ్రెస్‌ని డైరెక్టు లింకు ద్వారా హెడ్ క్వార్టర్సుకి తెలియ పరుస్తున్నారు. కంట్రోల్‌తో కాంటాక్టు చేస్తూనే ఉన్నారు.

పోలీసులు వచ్చి శవ పంచాయితీ జరిపించి పైడయ్య అవశేషాల్ని అంత్యక్రియలు జరప డానికి అనుమతించారు. శవం ముక్కల్ని గేంగు కూలీలు ఏరి ప్రక్కన పోగు చేస్తున్నారు. వాళ్ళతో పాటు ఏడ్చి, ఏడ్చి కన్నీరు ఇంకిపోయి దుఃఖం ఇగిరిపోయిన , గుండెని రాయి చేసుకున్న మలయాళీ మాస్టరు కుట్టి కూడా స్వహస్తాలతో పైడయ్య అవశేషాలని ఎక్కడా మిగలకుండా ఏరుతూ పోగు చేస్తున్నాడు.

చెట్లమీద అక్కడక్కడ రాబందులు దిగుతూ మెడలు చాచుకుంటూ చూస్తున్నాయి.

ప్రక్కన పొదల్లో ఈగలు జుమ్మున లేచాయి. పైడయ్య చెయ్యి అందులో ఇరుక్కుని ఉంది. ఆకాశం వైపు చాపిన చెయ్యి '' భగవంతుడా బండిని రక్షించు'' అన్నట్లు ఉంది. దాన్ని తుప్పల్లోనించి తీసి కళ్ళకద్దుకుని ఆప్యాయంగా తీసుకువస్తున్న కుట్టిని చూస్తూ అందరూ శిలా ప్రతిమల్లా నిలబడి పోయారు.

పైడయ్య అవశేషాల కుప్పలోంచి అప్పటికే చిన్న నీచువాసన కొడుతోంది. ఈగలు ముసురు తున్నాయి.

లైను గట్టు ప్రక్కనే పెద్ద గొయ్యి తవ్వారు అందులో పైడయ్య శరీరావశేషాలని పూడ్చి పెట్టారు. ఆఫీసర్లతో సహా అందరూ అక్కడే నిలబడి పైడయ్య అంతిమ యాత్రని మౌనంగా చూస్తున్నారు. గొయ్యి కప్పడం పూర్తయింది. కుట్టి పైడయ్య సమాధికి సాష్టాంగ నమస్కారం చేశాడు.

సూర్యుడు పడమటి కొండలో కృంగి పోతున్నాడు. ఆకాశం ఎర్రబారుతోంది.

కుట్టి తలవంచుకుని నిశ్శబ్దంగా పెద్ద ఇంజనీరుగారి వద్దకు వచ్చి గుడ్ల నీరు కక్కుతూ అమాంతంగా అతని చేతులు పుచ్చుకుంటూ గుండెల్లో తన్నుకొస్తున్న దుఃఖాన్ని తమాయించు కుంటూ '' నేను స్మాల్‌పాక్స్‌తో చచ్చిపోతూంటే నన్ను డే అండ్ నైట్ కనిపెట్టుకుని సేవజేసి తండ్రిలా కాపాడాడు . జస్ట్ లైక్ మై ఫాదర్... లైక్ ఎ ఫాదర్ ..... ఇంత మిజరబుల్ డెత్తా ? ఘాస్ట్‌లీ డెత్. వేర్ ఈజ్ గాడ్? ఈజ్ దిస్ హిజ్ జస్టిస్- ? ఫక్ ది హెల్! '' అని హిస్టీరికల్ గా అరిచాడు అందరూ సముదాయిస్తూ కుట్టిని అక్కడనుంచి తీసుకుపోయారు. పని పూర్తయింది.

సామాన్లు సర్దుకుని ట్రాలీలు, రిలీఫ్ ట్రయిన్, సాల్వేజి స్పెషలూ కూడా ఆఫీసర్లని, స్టాఫ్‌ని తీసుకుని బయలుదేరి వెళ్ళిపోయాయి. రైలుబండి కదిలింది . కొత్త కమ్ములమీద నెమ్మదిగా నడుస్తూ, దాటుకుని రానురాను వేగం పుంజుకుంటూ వెళ్ళిపోతోంది..... దూరంగా విజిల్....... కొండల్ని దాటుకుంటూ వెళ్ళిపోయింది.

★

మెల్లమెల్లగా అడవిలో నీడలు విస్తరించుకుంటూ చీకట్లు ముసురుకుంటున్నాయి. అంతా నిర్మానుష్యం.

లైనుగట్టు ప్రక్కన పైడయ్య సమాధికి కొంచెం దూరంలో ఒక టెంటు, ఇద్దరు గేంగు కూలీలు మాత్రమే మిగిలారు. కొత్తగా వేసిన పట్టాలని నెమ్మదిగా దాటమని వచ్చేపోయే బళ్ళకి కాషన్ సిగ్నల్స్ ఇస్తూ హెచ్చరించడానికి వాళ్ళని అక్కడ ఉంచారు.

బాగా చీకటి పడింది. టెంటులోంచి దీపం వెలుగు బైటికి పడుతోంది. లోపల ఇద్దరు కూలీలు మాట్లాడుకుంటున్నారు.

చంద్రుడు నిండుగా ప్రకాశిస్తున్నాడు. వెన్నెలలోనుంచి మంచుకురుస్తోంది.

వచ్చేపోయే బళ్ళకి టెంటు బయటికి వచ్చి విజిల్ ఊదుతూ పచ్చలాంతరు ఊపుతూ రాత్రంతా కాషన్ ఇస్తూనే ఉన్నారు. అర్ధరాత్రి దాటిపోయింది. ఒక గేంగు కూలీకి నిద్రపట్టేసింది. మరొకడు ముంచుకొస్తున్న నిద్రని తమాయించుకుంటూ మెలకువగా ఉండడానికి ప్రయత్ని స్తున్నాడు....

బయట రైలు పట్టాలమీద, టెంటుకు కాస్త దూరంలో ఏదో అలికిడి అయినట్లు నిద్ర ముంచుకొస్తున్న వాడికి స్పష్టాస్పష్టంగా వినిపించింది. నిద్రకళ్ళు నులుపుకుంటూ టెంటులోనుంచే చెవులు రిక్కించి విన్నాడు. ఎవరో మూలుగుతున్నట్లు ఉండుండి వినిపిస్తోంది. పట్టాల మీద రాళ్ళు దొర్లుతున్నాయి. పైడయ్య చావు..... శవం ముక్కలు జ్ఞప్తికి వచ్చేయి. వళ్ళు ఝుల్లుమంది. పైడయ్య దయ్యం అయిపోయి పట్టాలమీద తిరుగుతున్నాడు! అర్ధరాత్రి...... నిశ్శబ్దం. ప్రక్కనే నిద్రపోతున్న గేంగు కూలీని లేపాడు. ''అటువైపు విను'' అన్నట్లు సౌంజ్ఞ చేశాడు.

మళ్ళీ మూలుగులు దీనంగా వినిసిస్తున్నాయి...... స్పష్టంగా వినిపిస్తున్నాయి.

ఇద్దరు కూలీలు ధైర్యం కూడగట్టుకుని టెంటులోనుంచే భయం భయంగా తలలు బయటకు పెట్టి కలయజూశారు.

పుచ్చపువ్వులాంటి వెన్నెల. పట్టాల మధ్యలో దూరంగా ఏదో నల్లటి ఆకారం నడుస్తోంది. పైడయ్య బండి కింద పడిన చోట పట్టాలని వాసన చూస్తోంది. స్లీపర్ల మధ్యదేన్నో వెతుకుతోంది. ఉండుండి రాళ్ళని కాళ్ళతో బకురుతోంది. తలపైకెత్తి గాలిలో వాసనల్ని పసిగడుతోంది – సన్నటి మూలుగులు... పైడయ్య సొట్ట కుక్క 'కొండి' కుంటుకుంటూ నడుస్తోంది. ''పైడయ్య కుక్కరా!'' అని ఇద్దరూ బయటకి వచ్చారు.

మనుషుల అలికిడి పసికట్టి పట్టాల మధ్యనిల్చొని వాళ్ళవైపు చూసి గుర్రుమంది. వెన్నెల ప్రతిఫలిస్తున్న దాని కళ్ళు పేలవంగా మెరుస్తున్నాయి. ''ఆడుకూడా పోయేడు. ఒంటరిదయిపోయింది. ఆడి కోసం దేవులాడుతోంది పాపం!'' అనుకుంటూ టెంటులోకి వెళ్ళిపోయారు.

ఆ రాత్రంతా కుక్క పట్టాల మధ్య నడుస్తూ, మూలుగుతూ ఆకాశంవైపు మోరెత్తి ఏడుస్తోంది. పిలుస్తోంది. విలపిస్తోంది – తిరిగిరాని పైడయ్య కోసం.

టెంటులో కూలీలకి మగత నిద్రలో రైలు పట్టాల మీద కుక్క ఏడుపులు అలా తెల్లవార్లూ వినిపిస్తూనే ఉన్నాయి. చుట్టూ అడవీ, కొండలూ, వెన్నెలా, చంద్రుడూ మూగసాక్షులుగా ఆ నిశ్శబ్ద వాతావరణంలో దీనాతి దీనమైన ఆ మూగజీవి ఆక్రందనలు వింటున్నాయి.

తెల తెలవారుతోంది. కొండల్లో తీతువు పిట్ట అరుస్తోంది.

★



( ఆంధ్రజ్యోతి వీక్లీ – దీపావళి 1983)